ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -329 పేజీలు - 08 వెల - 04/- బుధవారం 22 అక్టోబర్ 2025

# శాంతిభద్రతలు ఉంటేనే రాష్ట్రానికి పెట్టుబడులు

**పెట్టుబడులకు రక్షణ ఉందన్న నమ్మకంతోనే గూగుల్ వచ్చింది: సీఎం చంద్రబాబు**

- గూగుల్ రాకకు అదే కారణమన్న సీఎం చంద్రబాబు
- రాజకీయ ముసుగులో పెరిగిపోతున్న నేరాలు, విద్వేషాలు
- పోలీసుల కుటుంబ సంక్షేమం ప్రభుత్వ బాధ్యత
- సోషల్ మీడియా నేరాలు పోలీసులకు పెను సవాలు
- మంగళగిరిలో ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినం



అమరావతి, **అక్టోబర్ 21ఆంధ్ర ప్రగతి**

రాష్ట్రంలో శాంతిభద్రతలు పటిష్టంగా ఉన్నాయన్న నమ్మకంతోనే గూగుల్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పెట్టుబడులకు రక్షణ ఉంటేనే పారిశ్రామికవేత్తలు వస్తారని, తద్వారానే రాష్ట్రంలో అభివృద్ధి, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని అన్నారు. మంగళగిరిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్ మైదానంలో మంగళవారం నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మిగతా 2లో...



# ఏపీ వ్యవసాయానికి ఆస్ట్రేలియా అండ..

- ఆస్ట్రేలియాలోని వెస్టన్ సిడ్నీ యూనివర్సిటీని సందర్శించిన మంత్రి నారా లోకేశ్
- ఏపీ వ్యవసాయ ఆధునికీకరణకు సహకరించాలని వర్సిటీ యాజమాన్యానికి విజ్ఞప్తి
- వాతావరణాన్ని తట్టుకునే పంటలు, ఫార్మింగ్‌పై కలిసి పనిచేయాలని ప్రతిపాదన
- ఆచార్య ఎన్జీ రంగా వర్సిటీతో భాగస్వామ్యం కావాలని సూచన

సిడ్నీ **అక్టోబర్ 21ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతను ప్రవేశపెట్టి, రైతులను బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ప్రఖ్యాత వెస్టన్ సిడ్నీ యూనివర్సిటీని (డబ్ల్యూఎస్‌యూ) సందర్శించి, వర్సిటీ సీనియర్ ప్రతినిధులు, వ్యవసాయ టెక్నాలజీ పరిశోధకులతో మిగతా 2లో...

## ప్రత్యేక కోర్టు ద్వారా లక్ష్మీనాయుడు హత్య కేసు విచారణ

**కందుకూరు నియోజకవర్గంలో లక్ష్మీ నాయుడు హత్య కేసుపై సీఎం సమీక్ష**

- ప్రత్యేక ట్రైబ్యునల్ ఏర్పాటు చేసి విచారణకు ఆదేశం
- నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం
- ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ నియామకానికి ఉత్తర్వులు




# తెలంగాణ పోలీసులు దేశంలోనే అగ్రస్థానం

**పోలీసు అమరవీరుల దినోత్సవంలో రేవంత్ రెడ్డి**

- విధి నిర్వహణలో పోలీసుల త్యాగాలు మరువలేనివని కొనియాడిన సీఎం
- అమరవీరుల కుటుంబాలకు అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా



హైదరాబాద్, **అక్టోబర్ 21ఆంధ్ర ప్రగతి**

మిగిలిన మావోయిస్టులు కూడా జనజీవన స్రవంతిలో కలిసి, తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవలి కాలంలో పలువురు మావోయిస్టులు లొంగిపోతున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. మిగతా 2లో...

## సీపీఐ జాతీయ కార్యదర్శిగా ఏపీ నేత రామకృష్ణ

- చండీగఢ్ జాతీయ మహాసభల్లో ఏకగ్రీవంగా ఎన్నిక
- ఇంతకాలం ఏపీ రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగిన రామకృష్ణ
- ఏపీ సీపీఐకి నూతన కార్యదర్శిగా ఈశ్వరయ్య ఏకగ్రీవం



అమరావతి, **అక్టోబర్ 21ఆంధ్ర ప్రగతి**

భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇప్పటిదాకా సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన కె. రామకృష్ణ ఇప్పుడు జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన సీపీఐ జాతీయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగతా 2లో...

## భూమనకు తిరుపతి పోలీసుల నోటీసులు

**తిరుపతి గోశాలలో గోవుల మృతి ఆరోపణలపై విచారణ**

- వెంటనే హాజరు కావాలని వర్సిటీ పోలీసుల ఆదేశం
- అధికారుల నిర్లక్ష్యం వల్లే మరణాలని గతంలో భూమన విమర్శ





# పెట్టుబడుల వేట

**3 రోజుల్లో 25 సమావేశాలు... యూఏఈలో సీఎం చంద్రబాబు పర్యటన**

- విశాఖ భాగస్వామ్య సదస్సు కోసం పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం
- పారిశ్రామికవేత్తలతో రోడ్‌షో, వరుసగా కీలక భేటీలు
- తెలుగు ప్రవాసులతోనూ ప్రత్యేకంగా సమావేశం

అమరావతి, **అక్టోబర్ 21ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే ఏకైక లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరో కీలక విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. నేటి నుంచి మూడు రోజుల పాటు ఆయన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో ఆయన అత్యంత బిజీగా గడపనున్నారు. మిగతా 2లో...



## రియాజ్ ఎన్‌కౌంటర్‌ను సుమోటోగా స్వీకరించిన మానవ హక్కుల కమిషన్.

- నివేదికను సమర్పించాలని డీజీపీకి కీలక ఆదేశాలు
- నవంబర్ 24వ తేదీ లోగా నివేదిక అందించాలని డీజీపీకీ ఆదేశం
- ఆత్మరక్షణ కోసం జరిపిన కాల్పుల్లో రియాజ్ చనిపోయినట్లు ప్రకటించిన డీజీపీ



హైదరాబాద్, **అక్టోబర్ 21ఆంధ్ర ప్రగతి**

నిజామాబాద్ కానిస్టేబుల్ హత్య కేసులో నిందితుడు రియాజ్ ఎన్‌కౌంటర్‌ను తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (ఎస్‌హెచ్‌ఆర్‌సీ) సుమోటోగా స్వీకరించింది. ఈ ఎన్‌కౌంటర్‌కు సంబంధించి నివేదికను సమర్పించాలని డీజీపీకీ ఆదేశాలు జారీ చేసింది. మిగతా 2లో...

## మార్చి నాటికి మావోయిజం అంతం

- మావోయిజంపై పోరులో భద్రతా దళాలది కీలక పాత్ర అన్న రాజ్‌నాథ్
- ఒకప్పటి రెడ్ కారిడార్లు ఇప్పుడు గ్రోత్ కారిడార్లుగా మారాయని వ్యాఖ్య
- ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలోకి వస్తున్న నక్సలైట్లు
- పోలీసు సంస్మరణ దినోత్సవంలో అమరవీరులకు నివాళులు




## జపాన్ చరిత్రలో కొత్త శకం..

**తొలి మహిళా ప్రధానిగా సనా తకాయిచి!**

- పార్లమెంట్ దిగువ సభలో సునాయాసంగా నెగ్గిన తకాయిచి
- సంకీర్ణం నుంచి వైదొలగిన కొమెయిటో పార్టీ
- జపాన్ ఇన్నోవేషన్ పార్టీతో ఎల్‌డీపీ కొత్త పొత్తు



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# ఏపీ వ్యవసాయానికి ఆస్ట్రేలియా అండ..

(మొదటి పేజీ తరువాయి)

కీలక సమావేశం నిర్వహించారు. ఏపీ వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు తమతో కలిసి పనిచేయాలని లోకేశ్ వారికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, “ఆంధ్రప్రదేశ్‌లోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంతో కలిసి పనిచేయాలి. వాతావరణ మార్పులను తట్టుకునే పంటల అభివృద్ధి, ప్రెసిషన్ ఫార్మింగ్ వంటి రంగాల్లో మీ నైపుణ్యాన్ని మా రైతులకు అందించాలి” అని కోరారు. స్మార్ట్ ఫార్మింగ్, అగ్రి-టెక్ ఆవిష్కరణలపై రైతులకు, వ్యవసాయ నిపుణులకు శిక్షణ ఇచ్చేందుకు సంయుక్త కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. స్మార్ట్ నీటిపారుదల వ్యవస్థలు, కృత్రిమ



మేధస్సు (ఏఐ) ఆధారిత వ్యవసాయ పరిష్కారాలను అభివృద్ధి చేసేందుకు ఇన్నోవేషన్ హబ్‌ల ఏర్పాటులో సహకరించాలని కోరారు. రాష్ట్రంలో స్థిరమైన వ్యవసాయ విధానాల రూపకల్పనకు పరిశోధన ఆధారిత సూచనలు ఇవ్వాలని మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. మంత్రి లోకేశ్ ప్రతిపాదనలపై వర్సిటీ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. తమ విశ్వవిద్యాలయం స్థిరమైన అభివృద్ధిలో ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానంలో ఉందని ప్రపంచంలోని టాప్ 2 శాతం విశ్వవిద్యాలయాలలో ఒకటిగా గుర్తింపు పొందిందని వారు వివరించారు. ఇప్పటికే ఐఐటీల వంటి భారతీయ సంస్థలతో కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. తమ అనుబంధ సంస్థ హాక్స్‌బరీ ఇన్ స్టిట్యూట్ ఫర్ ద ఎన్విరాన్‌మెంట్... భూసారం, నీటి యాజమాన్యం వంటి అంశాలపై విస్తృత పరిశోధనలు చేస్తోందన్నారు. ఏఐ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ టెక్నాలజీలను ఉపయోగించి పంట దిగుబడులను పెంచడంపై దృష్టి సారించామని, ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని వారు పేర్కొన్నారు.

# తెలంగాణ పోలీసులు దేశంలోనే అగ్రస్థానం

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లోని గోషామహల్ స్టేడియంలో నేడు నిర్వహించిన ‘పోలీసు అమరవీరుల స్మారక దినోత్సవం’లో ఆయన ఈ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి, ముందుగా పోలీసు అమరవీరుల స్మారక స్థూపాన్ని ఆవిష్కరించి, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన సిబ్బందికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజానికి పోలీసులు ఒక నమ్మకాన్ని, భరోసాను ఇస్తారని కొనియాడారు. ప్రజల శాంతిభద్రతల కోసం పోలీసులు తమ ప్రాణాలను సైతం పణంగా పెడుతున్నారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం పోలీసుల సంక్షేమానికి కట్టుబడి ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చాక 16 వేల కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాలను భర్తీ చేశామని గుర్తుచేశారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల కుటుంబాలకు విద్య, ఆర్థిక విషయాల్లో ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దేశంలోనే అత్యధిక పరిహారం అందిస్తున్నామని ఆయన తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సైబర్, డ్రగ్స్ వంటి కొత్త తరహా నేరాలు పుట్టుకొస్తున్నాయని, వాటిని ఎదుర్కోవడంలో తెలంగాణ పోలీసులు దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నారని సీఎం ప్రశంసించారు. డ్రగ్స్‌పై పోరాటానికి ‘ఈగల్ టీమ్’ను, సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. రాజకీయ ఒత్తిళ్లు లేకుండా పోలీసులు స్వేచ్ఛగా పనిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

# జపాన్ చరిత్రలో కొత్త శకం..

## తొలి మహిళా ప్రధానిగా సనా తకాయిచి!

జపాన్ రాజకీయ చరిత్రలో ఒక నూతన అధ్యాయం మొదలైంది. దేశ మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రిగా కన్జర్వేటివ్ నేత సనా తకాయిచి (64) ఎన్నికై చరిత్ర సృష్టించారు. మంగళవారం పార్లమెంట్ దిగువ సభలో జరిగిన ఎన్నికల్లో ఆమె విజయం సాధించారు. గత నెలలో ఎన్నికల్లో ఓటమికి బాధ్యత వహిస్తూ షిగెరు ఇషిబా రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది.

పార్లమెంటులోని 465 స్థానాలున్న దిగువ సభలో జరిగిన ఓటింగ్‌లో సనా తకాయిచికి 237 ఓట్లు లభించాయి. దీంతో ఆమె మెజారిటీ మార్కును సునాయాసంగా దాటారు. ఎగువ సభ ఆమోదం కూడా పొందిన తర్వాత, ఈ సాయంత్రం ఆమె జపాన్ 104వ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. చక్రవర్తిని కలిసిన అనంతరం ఆమె అధికారికంగా బాధ్యతలు చేపడతారు.

చైనా విధానాలపై తీవ్ర విమర్శలు చేసే వ్యక్తిగా గుర్తింపు పొందిన తకాయిచి, గతంలో హెవీ మెటల్ డ్రమ్మర్‌గా కూడా పనిచేశారు. అక్టోబర్ 4న అధికార లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డీపీ) అధ్యక్షురాలిగా ఆమె ఎన్నికయ్యారు. అయితే, ఆమె కన్జర్వేటివ్ భావాలు, పార్టీలోని నిధుల కుంభకోణం కారణంగా పాత మిత్రపక్షమైన కొమెయిటో పార్టీ సంకీర్ణం నుంచి వైదొలిగింది. ఈ పరిణామంతో ఎల్‌డీపీ.. సంస్కరణవాద, మితవాద పార్టీ అయిన జపాన్ ఇన్నోవేషన్ పార్టీ (జేఐపీ)తో సోమవారం సాయంత్రం కొత్త పొత్తు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా తకాయిచి మాట్లాడుతూ “జపాన్ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తానని, భావి తరాలకు బాధ్యత వహించే దేశంగా జపాన్‌ను తీర్చిదిద్దుతా” అని హామీ ఇచ్చారు. ఆమె సొంత పట్టణమైన నారాలో ఒక విశ్రాంత ఉద్యోగి మాట్లాడుతూ “ఆమె మహిళ అయినా చాలా గట్టి మనస్తత్వం ఉన్న వ్యక్తి. ఏది ఒప్పో, ఏది తప్పో స్పష్టంగా చెప్పగలరు” అని తన అభిప్రాయాన్ని వెల్లడించారు.



### మోదీ శుభాకాంక్షలు
#### బంధాన్ని మరింత బలోపేతం చేద్దామని పిలుపు

జపాన్ దేశ చరిత్రలో ఒక నూతన అధ్యాయం మొదలైంది. దేశానికి తొలి మహిళా ప్రధానమంత్రిగా సనే తకాయిచి ఎన్నికై చరిత్ర సృష్టించారు. ఈ చారిత్రక ఘట్టంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. సనే తకాయిచితో కలిసి పనిచేసేందుకు తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ప్రధాని మోదీ మంగళవారం తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక ప్రత్యేక పోస్ట్ చేశారు. భారత్, జపాన్ మధ్య ఉన్న ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో, అలాగే ప్రపంచవ్యాప్తంగా శాంతి, సుస్థిరత, శ్రేయస్సును నెలకొల్పడంలో ఇరు దేశాల బంధం అత్యంత కీలకమని ఆయన తన పోస్టులో అభిప్రాయపడ్డారు.

# మార్చి నాటికి మావోయిజం అంతం

అక్టోబర్ 21 ఆంధ్ర ప్రగతి

దేశంలో మావోయిజంపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఏడాది మార్చి నాటికి మావోయిజాన్ని దేశం నుంచి పూర్తిగా నిర్మూలిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పోలీసు సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఈరోజు ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. భద్రతా బలగాల సమష్టి కృషితో గత కొన్నేళ్లుగా మంచి ఫలితాలు వస్తున్నాయని రాజ్‌నాథ్ తెలిపారు. ఈ ఏడాది కూడా పలువురు అగ్రశ్రేణి నక్సలైట్లను మట్టుబెట్టినట్లు వెల్లడించారు. మావోయిజం ప్రభావిత జిల్లాల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిందని, మిగిలిన కొన్ని ప్రాంతాలను కూడా వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తిస్థాయిలో మావోయిస్టు రహితంగా మారుస్తామని ఆయన స్పష్టం చేశారు. “ఈ సమస్య జాడలు కూడా లేకుండా పోతాయని దేశం మొత్తం నమ్మకంతో ఉంది” అని ఆయన అన్నారు. ఒకప్పుడు ఛత్తీస్‌గఢ్, ఝార?ండ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో మావోయిజం పెను సమస్యగా ఉండేదని గుర్తుచేశారు. కానీ, ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందని, ఒకప్పుడు నక్సలైట్ల హింసతో వణికిపోయిన ప్రాంతాల్లో అభివృద్ధి పరుగులు పెడుతోందని వివరించారు. “గతంలో రెడ్ కారిడార్లుగా పేరుపొందిన ప్రాంతాలు ఇప్పుడు గ్రోత్ కారిడార్లుగా రూపాంతరం చెందుతున్నాయి” అని ఆయన పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, రహదారులు వంటి మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఢిల్లీలోని జాతీయ పోలీసు స్మారక చిహ్నం వద్ద జరిగిన పోలీసు సంస్మరణ దినోత్సవంలో రాజ్‌నాథ్ పాల్గొన్నారు. 1959లో లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ వద్ద చైనా సైనికుల దాడిలో ప్రాణాలు అర్పించిన 10 మంది పోలీసుల త్యాగాన్ని స్మరించుకుంటూ ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మావోయిజాన్ని అంతం చేయడంలో పోలీస్, సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, స్థానిక యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తున్న తీరు ప్రశంసనీయమని కొనియాడారు. వారి అవిశ్రాంత కృషి వల్లే ఈ సమస్య చరిత్రగా మిగిలిపోతోందని అన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో పోలీసు బలగాల ఆధునికీకరణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాజ్‌నాథ్ తెలిపారు. వారికి అత్యాధునిక ఆయుధాలు, డ్రోన్లు, నిఘా వ్యవస్థలు, ఫోరెన్సిక్ ల్యాబ్‌ల వంటి సాంకేతికతను అందిస్తున్నామని చెప్పారు. బలమైన పోలీసు వ్యవస్థతోనే బలమైన దేశ నిర్మాణం సాధ్యమని ఆయన పేర్కొన్నారు.

# శాంతిభద్రతలు ఉంటేనే రాష్ట్రానికి పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివని కొనియాడారు.

**గూగుల్ రాకకు అదే కారణం**

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారికి పూర్తి భద్రత ఉంటుందన్న భరోసా కల్పించడం ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ముఖ్యమంత్రి అన్నారు. “శాంతిభద్రతలు అనే పునాదిపైనే అభివృద్ధి, సంక్షేమం ఆధారపడి ఉంటాయి. సమాజంలో అశాంతి, అలజడి ఉంటే ఏ ఒక్క పరిశ్రమా రాష్ట్రం వైపు చూడదు. అందుకే శాంతిభద్రతల విషయంలో నేను ఎప్పుడూ కఠినంగా ఉంటాను. ఆ నమ్మకంతోనే విశాఖపట్నంలో గూగుల్ సంస్థ 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో ఏఐ డేటా హబ్ ఏర్పాటు చేస్తోంది. ఇది దేశంలోనే అతిపెద్ద పెట్టుబడుల్లో ఒకటి. ఇలాంటివి మరిన్ని రావాలంటే పోలీస్ వ్యవస్థ నిరంతరం అప్రమత్తంగా ఉండాలి” అని చంద్రబాబు వివరించారు. రాష్ట్రంలో ఫ్యాక్షనిజం, నక్సలిజం, రౌడీయిజాన్ని అణిచివేయడంలో ఏపీ పోలీసులది ప్రత్యేక గుర్తింపు అని ప్రశంసించారు.

**పోలీసులది ఉద్యోగం కాదు.. నిస్వార్థ సేవ**

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులకు ముఖ్యమంత్రి నివాళులు అర్పించారు. “1959 అక్టోబర్ 21న లధఖ్‌లో చైనా సైనికులతో వీరోచితంగా పోరాడి 10 మంది జవాన్లు ప్రాణత్యాగం చేశారు. వారి స్ఫూర్తితోనే ఏటా ఈ రోజును పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా జరుపుకుంటున్నాం. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 192 మంది పోలీసులు విధి నిర్వహణలో అమరులయ్యారు. ప్రజల రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెడుతున్న పోలీసులు చేసేది కేవలం ఉద్యోగం కాదు, అదొక నిస్వార్థ సేవ. వారి త్యాగాలను స్మరించుకుంటూ స్ఫూర్తి పొందాలి” అని అన్నారు.

**రాజకీయ ముసుగులో కొత్త నేరగాళ్లు**

సమాజంలో నేరాల స్వరూపం మారుతోందని, ముఖ్యంగా రాజకీయ ముసుగులో కొత్త తరహా నేరగాళ్లు పుట్టుకొస్తున్నారని చంద్రబాబు హెచ్చరించారు. “సమాజంలో అశాంతి సృష్టించి లబ్ధి పొందడమే లక్ష్యంగా కొందరు పనిచేస్తున్నారు. వీళ్లు సాధారణ నేరగాళ్ల కంటే ప్రమాదకరం. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తున్నారు. పాస్టర్ ప్రవీణ్ మరణం, జీడీ నెల్లూరులో అంబేద్కర్ విగ్రహ దహనం వంటి ఘటనల్లో వాస్తవాలను దాచిపెట్టి, మత ఘర్షణలు సృష్టించేందుకు ప్రయత్నించారు. సీసీ కెమెరాల వల్ల నిజాలు బయటపడ్డాయి. కల్తీ మద్యం విషయంలోనూ ఇలాగే దుష్ప్రచారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు,” అని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ద్వారా సాగే వ్యక్తిత్వ హననం, అసత్య ప్రచారాలు పోలీసులకు పెను సవాలుగా మారాయని పేర్కొన్నారు.

**టెక్నాలజీతో నేరాల కట్టడి**

మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీసు శాఖను సాంకేతికంగా బలోపేతం చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. “నేరగాళ్లు అప్‌డేట్ అవుతుంటే, వారిని పట్టుకోవడానికి పోలీసులు మరింత అప్‌డేట్‌గా ఉండాలి. అందుకే రాష్ట్రవ్యాప్తంగా ప్రతి 50 మీటర్లకు ఒక సీసీ కెమెరా ఏర్పాటు చేస్తున్నాం. ఇది పోలీసులకు మూడో కన్నులా పనిచేస్తుంది. డ్రోన్లు, ఫోన్ సిగ్నల్స్, గూగుల్ టేకవుట్ వంటి టెక్నాలజీని వినియోగించి నేరాలను ఛేదిస్తున్నారు. అడవుల్లో గంజాయి తోటలను, ఎర్రచందనం స్మగ్లర్లను గుర్తించడానికి డ్రోన్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఈగల్, శక్తి బృందాల ఏర్పాటుతో ఏపీ పోలీస్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది” అని అభినందించారు.

**పోలీసు కుటుంబాలకు ప్రభుత్వ అండ**

పోలీసుల సంక్షేమానికి, వారి కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. “పోలీసుల గౌరవం పెంచడంతో పాటు వారి కుటుంబ సంక్షేమ బాధ్యత మాది. పోలీసుల వైద్య సేవల కోసం 16 నెలల్లో రూ.33 కోట్లు విడుదల చేశాం. మరణించిన 171 మంది పోలీసులకు బీమా కింద రూ.23 కోట్లు అందించాం. ప్రభుత్వ ఉద్యోగులకు ఒక డీఏ మంజూరు చేయాలని నిర్ణయించాం. పోలీసులకు ఒక సరెండర్ లీవ్‌ను రెండు విడతల్లో చెల్లిస్తాం. 6,100 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తిచేశాం. శాఖాపరమైన పదోన్నతులు కూడా సకాలంలో అందిస్తాం” అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సీపీఐ జాతీయ కార్యదర్శిగా ఏపీ నేత రామకృష్ణ

## ఏపీ సీపీఐకి నూతన కార్యదర్శిగా ఈశ్వరయ్య ఏకగ్రీవం

(మొదటి పేజీ తరువాయి)



చండీగఢ్‌లో జరిగిన పార్టీ జాతీయ మహాసభల్లో ఈ నియామకం జరిగింది. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనడం ద్వారా ఆయనకు లభించిన గుర్తింపు ఈ పదవికి దోహదపడింది. రామకృష్ణ జాతీయ రాజకీయాల్లోకి వెళ్లడంతో, ఏపీ సీపీఐ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది. అటు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి పదవిని కూడా పార్టీ భర్తీ చేసింది. ఏపీ సీపీఐ కార్యదర్శిగా జి. ఈశ్వరయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వాస్తవానికి ఆగస్టులో ఒంగోలులో జరిగిన రాష్ట్ర మహాసభల్లోనే నూతన కార్యదర్శి ఎన్నిక పూర్తి కావాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. జాతీయ మహాసభల తర్వాతే ఈ నియామకం ఉంటుందని అప్పట్లో పార్టీ నాయకత్వం స్పష్టం చేసింది. దాని ప్రకారమే తాజా ఎన్నిక జరిగింది. ఇప్పటిదాకా రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరించిన కె.రామకృష్ణ మూడు పర్యాయాలు ఈ పదవిని చేపట్టడంతో, పార్టీ నిబంధనల ప్రకారం ఆయన కొనసాగేందుకు వీల్లేదు. దాంతో, ఆయన స్థానంలో ఈశ్వరయ్యను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

# ప్రత్యేక కోర్టు ద్వారా లక్ష్మీనాయుడు హత్య కేసు విచారణ

## కందుకూరు నియోజకవర్గంలో లక్ష్మీ నాయుడు హత్య కేసుపై సీఎం సమీక్ష

అమరావతి **అక్టోబర్ 21 ఆంధ్ర ప్రగతి**

నెల్లూరు జిల్లా దారకానిపాడులో ఇటీవల జరిగిన లక్ష్మీనాయుడు హత్య కేసు విచారణను వేగవంతం చేసేందుకు ప్రత్యేక ట్రైబ్యునల్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ దారుణ ఘటనను తీవ్రంగా ఖండించిన ఆయన, నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో ఆయన హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రి నారాయణ, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, లక్ష్మీనాయుడు హత్య అత్యంత అమానుషమని, ఈ కేసు విచారణను ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు అప్పగించి, వీలైనంత త్వరగా దర్యాప్తు పూర్తి చేయాలని సూచించారు. కేసు వాదనల కోసం ప్రత్యేకంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమించాలని ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని చంద్రబాబు హెచ్చరించారు. ఇలాంటి వ్యవహారాలపై ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరిస్తుందని, శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

# పెట్టుబడుల వేట

(మొదటి పేజీ తరువాయి)

కేవలం మూడు రోజుల్లోనే ఏకంగా 25 సమావేశాల్లో పాల్గొంటూ, రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకురావడమే ప్రధాన అజెండాగా ముందుకు సాగనున్నారు. విశాఖపట్నంలో నవంబర్ 14, 15 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సు (పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్) విజయవంతమే ధ్యేయంగా ఈ పర్యటన సాగనుంది.

**పర్యటన షెడ్యూల్ ఇలా...**

ముఖ్యమంత్రి చంద్రబాబు అక్టోబర్ 22న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నుంచి దుబాయ్‌కు బయల్దేరి, భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2 గంటలకు అక్కడికి చేరుకుంటారు. దుబాయ్‌లో అడుగుపెట్టిన వెంటనే ఆయన తన అధికారిక కార్యక్రమాలను ప్రారంభిస్తారు.

మూడు రోజుల పర్యటనలో ప్రభుత్వ ప్రతినిధులతో 3 సమావేశాలు, పారిశ్రామికవేత్తలతో 14 వన్-టు-వన్ భేటీలు, రౌండ్ టేబుల్ సమావేశాలు ఉంటాయి. వీటితో పాటు 2 సైట్ విజిట్స్, 2 మీడియా ఇంటర్వ్యూలు, సీఐఐ ఆధ్వర్యంలో ఒక రోడ్‌షో, తెలుగు ప్రవాసులతో మరో సమావేశం సహా మొత్తం 25 కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. ప్రతిరోజూ దాదాపు ఐదారు సమావేశాలు ఉండేలా పర్యటనను పకడ్బందీగా రూపొందించారు. పర్యటనలో భాగంగా తొలిరోజైన 22న చంద్రబాబు ఐదు ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో సమావేశం కానున్నారు. శోభా గ్రూప్, షరాఫ్ డీజీ, ట్రాన్స్ వరల్డ్ గ్రూప్, లూధా గ్రూప్, దుబాయ్ ఫ్యూచర్ ఫౌండేషన్ వంటి సంస్థల అధినేతలతో ఆయన వన్-టు-వన్ భేటీలు నిర్వహిస్తారు. ఈ సమావేశాల్లో ప్రధానంగా ఇండస్ట్రియల్ పార్కులు, ఐటీ, లాజిస్టిక్స్, వేర్‌హౌసింగ్, పోర్టులు, షిప్ మేనేజ్‌మెంట్ వంటి కీలక రంగాల్లో రాష్ట్రంలో ఉన్న పెట్టుబడుల అవకాశాలపై చర్చిస్తారు. అనంతరం, ఆయన ‘మ్యూజియం ఆఫ్ ది ఫ్యూచర్’ను సందర్శిస్తారు. అక్కడ ‘జర్నీ టు 2071’ థీమ్‌తో ఏర్పాటు చేసిన స్పేస్ ట్రావెల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను, భవిష్యత్ టెక్నాలజీ సొల్యూషన్స్‌ను పరిశీలిస్తారు. అదే రోజు రాత్రి జరిగే రోడ్‌షోలో పాల్గొని పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ప్రసంగించి, విశాఖ సదస్సుకు ఆహ్వానిస్తారు. గతంలో సింగపూర్‌లో విజయవంతంగా పర్యటించిన ముఖ్యమంత్రి బృందం, ఇప్పుడు యూఏఈలోని పారిశ్రామికవేత్తలను, ప్రభుత్వ ప్రతినిధులను విశాఖ సదస్సుకు ఆహ్వానించనుంది. తన పర్యటన చివరి రోజున, దుబాయ్‌లో ఏపీఎన్ఆర్‌టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే తెలుగు డయాస్పోరా సమావేశంలో చంద్రబాబు పాల్గొని ప్రసంగిస్తారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రవాసుల భాగస్వామ్యంపై ఆయన చర్చించనున్నారు.

# రియాజ్ ఎన్‌కౌంటర్‌ను సుమోటోగా స్వీకరించిన మానవ హక్కుల కమిషన్.

(మొదటి పేజీ తరువాయి)

నిజామాబాద్‌లో జరిగిన సంఘటన గురించి వార్తాపత్రికల్లో వచ్చిన కథనాలను మానవ హక్కుల కమిషన్ పరిగణనలోకి తీసుకుంది. నిందితుడు రియాజ్ సాయుధ రిజర్వ్ కానిస్టేబుల్ సర్వీస్ ఆయుధాన్ని లాక్కుని పారిపోవడానికి ప్రయత్నించాడని, ఆ తర్వాత పోలీసులు ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపారని, ఫలితంగా అతను మరణించాడని పోలీసులు చెబుతున్నారు. ఆత్మరక్షణ కోసం జరిగిన కాల్పుల్లో నిందితుడు రియాజ్ మృతి చెందినట్లు డీజీపీ కూడా ప్రకటించారు. రియాజ్ ఎన్‌కౌంటర్ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద జీవించే హక్కుకు సంబంధించిన ముఖ్యమైన ప్రశ్నలను లేవనెత్తుతుందని ఈ సందర్భంగా మానవ హక్కుల కమిషన్ పేర్కొంది. నవంబర్ 24వ తేదీ లోగా ఈ సంఘటనకు దారి తీసిన పరిస్థితులను, కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్, పోస్టుమార్టం నివేదికను అందజేయాలని డీజీపీని ఆదేశించింది.

అక్టోబర్ 17న నిజామాబాద్ సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్‌ను రౌడీషీటర్ రియాజ్ పొడిచి చంపాడు. పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న రియాజ్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకు వెళుతుండగా రియాజ్ కత్తితో దాడి చేశాడు. కానిస్టేబుల్ ప్రమోద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ క్రమంలో రియాజ్‌ను ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. గాయపడిన రియాజ్‌ను పోలీసులు నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో ఓ కానిస్టేబుల్ నుంచి గన్ లాక్కుని పారిపోయే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో పోలీసులు ఆత్మరక్షణ కోసం జరిపిన కాల్పుల్లో రియాజ్ మరణించాడు.

# భూమనకు తిరుపతి పోలీసుల నోటీసులు

## తిరుపతి గోశాలలో గోవుల మృతి ఆరోపణలపై విచారణ

తిరుపతి, **అక్టోబర్ 21 ఆంధ్ర ప్రగతి**

తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర గో సంరక్షణశాలలో గోవుల మృతిపై తీవ్ర ఆరోపణలు చేసిన వైసీపీ సీనియర్ నేత, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఆయన చేసిన వ్యాఖ్యలకు సంబంధించి విచారణ నిమిత్తం తమ ఎదుట హాజరు కావాలని ఆ నోటీసులో స్పష్టం చేశారు. గోవుల మృతి ఘటనపై భూమన చేసిన ఆరోపణల నేపథ్యంలో, పూర్తి వివరాలు తెలుసుకునేందుకు విచారణకు సహకరించాలని తిరుపతి వర్సిటీ పోలీస్ స్టేషన్ అధికారులు మంగళవారం ఆయనకు నోటీసులు అందజేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసుకోనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల భూమన కరుణాకర్ రెడ్డి తిరుపతిలోని గోశాలపై సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. గోశాలలోని అధికారుల నిర్లక్ష్యం, సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే పదుల సంఖ్యలో గోవులు అకాల మరణం చెందాయని ఆయన విమర్శించారు. వాటికి సరైన సంరక్షణ, వైద్యం అందించడంలో సిబ్బంది పూర్తిగా విఫలమయ్యారని ఆయన ఆరోపించారు.

భూమన చేసిన ఆరోపణలు స్థానికంగా రాజకీయ దుమారం రేపడంతో, పోలీసులు ఈ వ్యవహారంపై దృష్టి సారించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
బుధవారం 22 అక్టోబర్ 2025

# పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఘన నివాళి



**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 21:** సమాజంలో శాంతిభద్ర భద్రతల పరిరక్షణ కోసం అనుక్షణం కృషి చేస్తున్న పోలీసు అమరవీరులకు జనసేన పార్టీ నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగాజనసేన పార్టీ నాయకులు దండు మురళీ కృష్ణ మాట్లాడుతూ..రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం అనుక్షణం శ్రమించి,దేశవ్యాప్తంగా శాంతిభద్రతల బాధ్యతలు చేపట్టి, విధినిర్వహణలో తృణప్రాయంగా త్యజించి ప్రాణాలు కోల్పోయిన పోలీసు సోదరులకు సంఘీభావంగా అమరవీరులందరికి జనసేన పార్టీ నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమలో నంద్యాల జనసేన పార్టీ నాయకులు నాగి వెంకటేశ్వర్లు, మరాచు గురు బాబు, జనసేన రాము, దినేష్, అశోక్, శ్రవణ్, అడ్వకేట్ లు జీ.వీ.ఎన్.ప్రసాద్, డి.కిరణ్ కుమార్, జీ.శ్రీ చైతన్య, కృష్ణ గౌడ్, డాక్టర్ జీ.రమేష్ జనసైనికుల తదితరులు.

# నంద్యాలవాసి కి దక్కిన అరుదైన పురస్కారం.

**ఆంధ్ర ప్రగతి విజయవాడ, అక్టోబర్ 19:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ నగరంలో ఈరోజు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సిసిసి (క్యాంపెనియన్షిప్ కమ్యూనిటీ చేంజ్ మేకర్) అవార్డ్స్-2025 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.
సమాజ సేవా రంగంలో విశిష్టమైన సేవలు అందిస్తున్న వివిధ రంగాల స్వచ్ఛంద సేవకులను ఈ సందర్భంగా పురస్కరించారు.
ఈ కార్యక్రమంలో నంద్యాలకి చెందిన సమాజ సేవకుడు, విజయ బ్లడ్ సెంటర్ కోఆర్డినేటర్ మరియు ఆసరా సొసైటీ అధ్యక్షుడు షేక్ బాబా ఫక్రుద్దీన్ కు “క్యాంపెనీయన్షిప్ కమ్యూనిటీ చేంజ్ మేకర్ అవార్డు-2025” లభించింది. ఆయన ఎన్నో రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు, అనాధ పిల్లలకు సహాయం, మరియు సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సామాజిక రంగంలో విశిష్ట సేవలందించారు.ఈ సందర్భంగా అవార్డు అందుకున్న షేక్ బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ %-%“ఈ అవార్డు నాకు అందించడం ఎంతో గౌరవంగా భావిస్తున్నాను. సిసిసి అవార్డు నిర్వాహకులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నాను. అలాగే నా పిలుపు మేరకు ఏ ఆపదలోనైనా రక్తదానం చేయడానికి ముందుకు వచ్చే నా రక్తదాత మిత్రులకే ఈ అవార్డును అంకితం చేస్తున్నాను అని తెలిపారు. అలాగే నన్ను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తున్న నా




తల్లిదండ్రులు, నా భార్యకు మరియు నా శ్రేయోభిలాషులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. ఈ అవార్డుతో నా బాధ్యత మరింత పెరిగిందిబీ భవిష్యత్తులో కూడా ఎవరికి రక్తం అవసరం అయినా, నంద్యాల జిల్లా వ్యాప్తంగా సేవ చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాను” అని తెలిపారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర మైనారిటీ సంక్షేమ మరియు న్యాయశాఖ మంత్రి ఎన్.ఎం.డి.ఫరూక్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ టీ.డి.జనార్ధన్, మాజీ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఇంతియాజ్ , సోషల్ ఇన్ఫ్లుయెన్సర్ శ్రీ బ్రదర్ సిరాజుర్ రహ్మాన్, మరియు ముస్లిం సమాజానికి చెందిన ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.సిసిసి అవార్డు నిర్వాహకులు షబ్బీర్ గారి చేతులమీదుగా షేక్ బాబా ఫక్రుద్దీన్ గారు ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను అందరూ ప్రశంసించారు.
ఈ కార్యక్రమంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న స్వచ్ఛంద సేవకులు, సామాజిక కార్యకర్తలు, మరియు సిసిసి సంస్థ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాల్యవివాహాల నిర్మూలణ కోసం
# ప్రతి ఒక్కరు కృషి చెయ్యాలి

## -సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి.

**ఆంధ్ర ప్రగతి డోన్ అక్టోబర్ 21:**
డోన్ పట్టణంలోని ఐసిడిఎస్ ఆఫీసు నందు సిడిపిఓ ఎస్.శంషాద్ బేగం అధ్యక్షతన సామాజిక కార్యకర్త డోన్ పి మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో
అయోడిన్ నివారణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం విడుదల చేసిన అయోడిన్ నివారణ జాగ్రత్తల కరపత్రాలు విడుదల చేసి పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు పరమేశ్వరమ్మ, శకుంతల, అరుణ, తిమ్మమ్మ ,దేవకృపమ్మ, ఉషారాణి, రాధమ్మ ,శకుంతల, ఉషారాణి, ఈశ్వరమ్మ ,శోభారాణి ,అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సిడిపిఓ యస్ శంషాద్ బేగం,సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి మాట్లడూతూ..పిసి పీఎన్డీటీ (గర్భస్థ పిండ పరీక్ష నివారణ) చట్టం పై ప్రతి ఒక్కరు కలిగి ఉండాలని ఐసిడిఎస్ ఆఫీసులో ఏర్పాటు చేసిన సమావేశంలో అంగన్వాడి టీచర్లకు సిడిపిఓ యస్.శంషాద్ బేగం సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి అవగాహణ కల్పించారు. వారు మాట్లాడుతూ ఇటీవలి కాలంలో మన దేశం లో గణాంకాలు పరిశీలిస్తే ఆడపిల్లల నిష్పత్తి తగ్గుతున్నది. కాలానుగుణంగా వస్తున్న మార్పుల వల్ల దంపతులు మగపిల్లాడు పుడితే బాగుంటుందని భావించడం వల్ల ఆడపిల్లల భ్రూణ హత్యలు జరుగుతున్నా కారణంగా ఇలాంటి హత్యలను నిలువరించేందుకు ప్రభుత్వం 1994లో పిసి పీఎన్డీటీ (గర్భస్థ పిండ పరీక్ష నివారణ) చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం పై పూర్తిస్థాయిలో అవగాహణతో అక్రమ లింగనిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్లపై సమాచారం అందించడానికి సమాజంలో ప్రతీ ఒక్కరూ బాధ్యతగా ఈ చట్ట అమలుకు సహకరించాలని డోన్ సిడిపిఓ యస్. శంషాద్ బేగం, సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి కోరారు. ఆడ మగ ఇద్దరూ







సమానమేనని, లింగ వివక్ష చూపడం నేరమేనని అన్నారు. ఆడబిడ్డలను పుట్ట నిద్దాం, పెరగనిద్దాం, చదవనిద్దామని డోన్ సిడిపిఓ యస్. శంషాద్ బేగం, సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు. అలాగే శరీరంలో అయోడిన్ లోపిస్తే అనారోగ్యం తప్పదు. మనం రోజూ తీసుకునే ఉప్పులో ఇది ఉంటుంది. శరీరంలోని హార్మోన్ల ఉత్పత్తికి ఇది కూడా కీలకపాత్ర వహిస్తుంది. జీవక్రియలు చురుగ్గా ఉండేలా చేస్తుంది. శరీరానికి అవసరమైన సూక్ష్మపోషకాల్లో ఇది చాలా ముఖ్యమైనది. అయితే దీనిపై తగిన అవగాహణ లేకపోవడంతో దీనిని తీసుకోలేక చాలామంది రకరకాల అనారోగ్యాలకు గురవుతున్నారు. ఇటీవల కాలంలో అయోడిన్ లోపంతో గర్భిణీలు, చిన్నారులు అధిక సంఖ్యలో అనారోగ్యం బారిన పడుతున్నారు. ప్రతి వంద మందిలో ఇరవై మందికి ఈ లోపం ఉన్నట్లు వైద్య పరిశోధనల్లో తేలింది. దీనిపై ప్రజల్లో అవగాహణ అవసరమని వైద్యనిపుణులు తెలియజేస్తున్నారని డోన్ సిడిపిఓ యస్. శంషాద్ బేగం, సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు.అయోడైజ్డ్ ఉప్పు వాడడంలోనూ చాలామందికి అవగాహణ ఉండడం లేదు. కూరలు బాగా ఉడుకుతున్నప్పుడు వేడిగా ఉన్నప్పుడు అందులో ఉప్పు వేస్తున్నారు. దీంతో అయోడైజ్డ్ ఉప్పు వాడినా ఉపయోగం ఉండడం లేదు. వేడికి అయోడిన్ కోల్పోవడం జరుగుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. వండిన పదార్థాలు చల్లారిన తరువాత మాత్రమే అందులో అయోడైజ్డ్ ఉప్పు వేసుకోవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి, డోన్ సిడిపిఓ యస్. శంషాద్ బేగం తెలిపారు. అలాగే బాల్య వివాహాల రహిత దేశమే మన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలని బాల్య వివాహాల పట్ల పూర్తి అవగాహణ కలిగి ఉండాలని డోన్ సిడిపిఓ యస్. షంషాద్ బేగం,సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి పేర్కొన్నారు. బాల్య వివాహాలు అరికట్టడంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని తెలియజేశారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై తల్లదండ్రులు అవగాహన కల్గి ఉండాలని బాల్య వివాహాల నిర్మూలణకు టోల్ ఫ్రీ నెంబర్ 1098 కు ఫోన్ చేసి బాల్య వివాహాలు నిర్మూలించాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి, డోన్ సిడిపిఓ యస్.షంషాద్ బేగం తెలిపారు. అలాగే ఆడబిడ్డ ఐదు నుంచి పది రోజులు హైస్కూల్ కి రాకపోతే అంగన్వాడి టీచర్ కు గాని ఐసిడిఎస్ వాళ్ళకు గాని సమాచారం అందించాలని డోన్ సిడిపిఓ ఎస్. షంషాద్ బేగం,సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు.

# శ్రీరాముడి ఔదార్యం యావత్ప్రపంచానికి ఆదర్శం

## డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే





**ఆంధ్ర ప్రగతి జూపాడు బంగ్లా అక్టోబర్ 21:**
శ్రీరాముడి ఔదార్యం యావత్ప్రపంచానికి ఆదర్శమని, శ్రీరాముడు చూపించిన కరుణ, దాతృత్వం, క్షమాగుణం, అసూయ లేనితనం, సకల ప్రాణుల హితాన్నికోరే గుణం, మానవులపైనే కాక పశుపక్షాదులపై దయ కలిగి ఉండడం, ఇతరులు చేసిన ఉపకారాన్ని గుర్తించడం మొదలైన గుణాలు మానవజాతి మనుగడకు అవసరమైన గుణాలని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా, జూపాడుబంగ్లా మండలం, తూడిచెర్ల గ్రామంలోని శ్రీ రామాలయం నందు ఐదు రోజుల ధార్మిక కార్యక్రమాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ప్రారంభో ఉపన్యాసం చేశారు. తదనంతరం స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు, ధర్మప్రచారకులు జయదేవానంద స్వామి శ్రీమద్రామాయణంపై చేసిన ధార్మిక ప్రవచనం భక్తులను ఎంతగానో అలరించినది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గండు బాల మద్దిలేటి, పారిశ్రామికవేత్త బి.పద్మనాభయ్య, తితిదే ధర్మ ప్రచార మండలి సభ్యులు పి. రామచంద్రుడు, డి. సుధాకర్, ఎన్. రాముడు, బాలకృష్ణ, ఉప సర్పంచ్ కె.చెన్నారెడ్డి, కెగోపాల్ రెడ్డి, డి. చిన్న నరసిహులు, కుమ్మరి మధుతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అమావాస్య కావడం వల్ల భక్తాదులందరికి భక్ష భోజనాలు ఏర్పాటు చేశారు.

# పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మరణీయం.

## సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి.



**ఆంధ్ర ప్రగతి డోన్ అక్టోబర్ 21:**
డోన్ పట్టణంలో సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి ఆధ్వర్యం లో అక్టోబర్ 15 నుంచి 21 వరకు పోలిస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా వారి చిత్ర పటానికి పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించారు. వారిని స్మరించుకున్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా పోలిస్ అమరవీరులకు జోహార్లు అర్పించారు.ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి మాట్లాడుతూలిమన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారులినేటి మన నిశ్చింత జీవితం అమర వీరుల త్యాగఫలం అక్టోబర్ 21 అమరవీరుల సంస్మరణ దినోత్సవం వారోత్సవాల సందర్భంగా అమరవీరులను స్మరించుకున్నారు ప్రజల కోసం మంచి సమాజం కోసం శ్రమిస్తు అమరులైన అమర వీరులకు అశ్రుతాంజలి. వేగుచుక్కలై వెలుగుచున్న పోలీస్ అమర వీరులారా విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమరవీరులకు నిత్య నీరాజనం. ప్రజాస్వామ్య పరిరక్షణ శాంతి భద్రతల సంరక్షణలో అసువులు బాసిన పోలీసు అమరవీరులకు ఘణ నివాళి.ప్రజల కోసం ప్రాణాలను తృణప్రాయం చేసిన వీరులారా ప్రజాస్వామ్య సాధనకి పునాదులై పునీతులైనారు.నేటి మన నిశ్చింత జీవితం వారి అవిశ్రాంత త్యాగఫలం.వీరి చరిత్రను వేనోళ్ల పొగుడుదాం.అసువులు బారిన పోలీస్ అమరవీరులారా, వీరమరణం పొందిన యోధానుయోధులారా మీకు వందనం. భారతమాత ముద్దుబిడ్డ లారా మీ వీర సౌర్య పరాక్రమాలు మీ కీర్తి చంద్రికలు అజరామరం. మీ సాహసకృత్యలు పోలీసులందరికీ స్ఫూర్తిదాయకం. సమాజసేవలో పోలీస్ లేని జీవణం అగమ్యగోచరం నిత్యం వారి సేవలే మన ప్రజల శాంతి భద్రతలకు నిలయమని సామాజిక కార్యకర్త పి.మహమ్మద్ రఫి అన్నారు.

# కార్తీక మాస మహెూత్సవాలకు బిసి రాజారెడ్డికి ఆహ్వానం.!

## -యాగంటి క్షేత్రంలో ఈనెల 22 నుంచి నవంబర్ 20వ తేదీ వరకు కార్తీకమాస మహెూత్సవాలు.

### - నవంబర్ 5న కార్తీక లక్ష దీపోత్సవం. - ఉత్సవాలకు హాజరుకావాలని బిసి రాజారెడ్డికి ఆహ్వానం.

**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె అక్టోబర్ 19:**
జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి వార్ల దేవస్థానం నందు ఈనెల 22వ తేదీ నుంచి నిర్వహించనున్న కార్తీక మాస మహెూత్సవాలకు బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ మేరకు ఆలయ కార్య నిర్వహణాధికారి పాండురంగారెడ్డి , యాగంటి పల్లె ఉప సర్పంచ్ బండి మౌళేశ్వర్ రెడ్డి, ఆలయ అర్చకులు బిసి రాజారెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈనెల 22వ తేదీ నుంచి నవంబర్ 20వ తేదీ వరకు యాగంటి క్షేత్రంలో కార్తీకమాస మహెూత్స వాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 5వ తేదీన ప్రత్యేకంగా కార్తీక దీపోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నట్లు వివరించారు. ఉత్సవాల్లో పాల్గొని ఉమామహేశ్వర



స్వామి వార్లను దర్శించుకోవాలని బిసి రాజారెడ్డిని ఆలయాధికారులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా బిసి రాజారెడ్డి మాట్లాడుతూ ... యాగంటి క్షేత్రానికి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక , తమిళనాడు తదితర సుదూర ప్రాంతాల నుంచి శివభక్తులు వేలాదిగా వస్తారని వారు ఇబ్బందులు పడకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్తీక మాస మహెూత్సవాలకు సంబంధించిన ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆలయ



వార్షిక ఆదాయం పెంచేందుకు కృషి చేయడంతో పాటు లడ్డూ ప్రసాదంలో నాణ్యతని పెంచి భక్తులకు అందజేస్తున్నందుకు ఆలయ ఈవో పాండురంగా రెడ్డి , చంద్ర మౌళీశ్వర్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు.

# జిల్లాలో ఘనంగా అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలు.

**విధి నిర్వహణలో ప్రాణాలను తృణప్రాయంగా భావించి ప్రజల శ్రేయస్సుకై ప్రాణాత్యాగం చేసిన పోలీసుల సేవలు మరువలేము.**

**దేశరక్షణలో సైనికులు, ప్రజాస్వామ్య శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు అభినందనీయం.**

**విధి నిర్వహణలో ప్రాణ త్యాగం చేసిన పోలీసు అమరవీరులకు ఘనంగా నివాళులు.**









**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ అక్టోబర్ 21**
నంద్యాల జిల్లా బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయం నందు అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలు జిల్లా ఎస్పీ సునిల్ షెరాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా ఐఏఎస్ మరియు త్రి ఏ డి జె అమ్మన్నరాజు హాజరైనారు.ముందుగా పెరేడ్ కమాండర్ జి.బాబు వద్ద నుండి జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు.అనంతరం ఏ ఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు విధి నిర్వహణలో మరణించిన వారి వివరాలను అందరికీ తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గినియా మాట్లాడుతూ.. సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ అమరులైన మన పోలీసు వీరులను స్మరించుకోవడం ఎంతైనా గర్వించదగ్గ విషయమని తెలియజేశారు.పోలీసు ఉద్యోగం అనేది అత్యంత కష్టతరమైనది ఎందుకనగా పోలీస్ విధులకు పగలు,రాత్రి ఎండ వాన చలి అనే తేడాలు ఉండవు అనునిత్యం వారు విధులు తప్పనిసరిగా నిర్వహించవలసి ఉంటుంది అందుకే ఇది చాలా కష్టంతో కూడుకున్నది.
అంతేకాక పోలీసులు సమాజంలో శాంతిభద్రతలను కాపాడుతూ ప్రజలకు రక్షణ కల్పిస్తూ అదే విధంగా శారీరకంగా మానసికంగా వారి ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ సమర్థవంతంగా విధులు నిర్వహించవలసి ఉంటుంది మరియు కుటుంబ బాధ్యతలను తీసుకొని పిల్లల విద్యలో వారికి మంచి భవిష్యత్తు ఇచ్చేందుకు కృషి చేయవలసి ఉంటుంది అంతేకాక సమాజానికి ఒక గైడ్ లాగా మరియు శాంతిభద్రతలను సమర్థవంతంగా నిర్వహించేలా కృషి చేయాలి యువతకు మార్గదర్శకంగా నిలవాలి టెక్నాలజీ పెరిగిపోతున్న సందర్భంలో సైబర్ క్రైమ్ నిర్వహించి అంతకు మించిన టెక్నాలజీని వినియోగించుకునేందుకు కృషి చేయాలి ఫ్రెండ్లీ పోలీసింగ్ ను సమర్థవంతంగా నిర్వహించాలి స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులు సమస్యలను ఓపికతో విని వాటిని సమర్థవంతంగా పరిష్కరించాలి అందువల్లనే పోలీస్ ఉద్యోగం అనేది అత్యంత కష్టంతో కూడుకున్నటువంటిది అని ఈ సందర్భంగా తెలియజేయడం జరుగుతుంది. కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించి సంవత్సరం నాలుగు నెలలపాటు జిల్లాలో సమర్థవంతంగా విధులు నిర్వహించడానికి పోలీసులు సహకరించిన విధానం వారు విధులలో చేసిన కృషి ఎంతో గొప్పదన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ మాట్లాడుతూ..
పోలీసులు ప్రతిరోజు ఎండ వాన చలి పగలు రాత్రి అనే తేడా లేకుండా వారికి కేటాయించిన విధులు నిర్వహిస్తూ కుటుంబానికి దూరంగా ఉండి పోలీస్ విధులు నిర్వహించడం అత్యంత కష్టతరమైనది.
సమాజంలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే సంఘవిద్రోహ శక్తులను అరికట్టేందుకు మరియు శాంతిభద్రతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పోలీసులు చేసే సేవ చాలా అనిర్వచనీయమైనదని గత రెండు రోజుల ముందు ప్రాణాలను పణంగా పెట్టి విధి నిర్వహణలో అమరుడైన హైదరాబాద్ కు చెందిన కానిస్టేబుల్ ను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అందువల్లనే పోలీస్ ఉద్యోగం అన్నది చాలా కష్టంతో కూడుకున్నదని ఈ సందర్భంగా తెలియజేయడం జరుగుతుందన్నారు. 1959 అక్టోబరు 21 వ తేదీన భారత్ – చైనా సరిహద్దు లధఖ్లోని హాట్ స్ప్రింగ్ వద్ద పహారాలో ఉన్నటువంటి 10 మంది సి.ఆర్.పి.ఎఫ్ జవానులపై చైనా చొరబాటుదారులు దాడి చేయగా ధైర్యసహసాలతో వారిపై ప్రతి దాడి చేస్తూ తమ చివరి రక్తపుబొట్టు వరకు పోరాడి వీరమరణం పొందినారు.స్వాతంత్ర్యం తరువాత దేశభద్రత కోసం పోలీసులు ప్రాణాలు అర్పించిన మొట్టమొదటి సంఘటన అది. అప్పటి నుండి ప్రతి సంవత్సరము విధినిర్వహణలో మరణించిన పోలీసువారి జ్ఞాపకార్థం అక్టోబర్ 21వ తేదిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినముగా జరుపుకొనుచున్నాము.
పోలీసు అమరవీరులను ఆదర్శంగా,స్ఫూర్తిగా తీసుకుంటూ అమరవీరుల కుటుంబాలకు అండదండగా ఉన్నాము.అమరవీరుల కుటుంబ సభ్యులతో మాట్లాడి, వారి సమస్యలను పరిష్కరించడము మరియు వారి కష్టాలకు అండగా నిలుస్తున్నామన్నారు.
ఈ సందర్భంగా అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి గారైన అమ్మన్నరాజు మాట్లాడుతూ.. విధినిర్వహణలో అమరులైన పోలీసు సోదరులకు స్మరించుకోవడం వారి కుటుంబ సభ్యులను సన్మానించడం ఎంతో గర్వించదగ్గ విషయమని తెలియజేస్తూ దేశాన్ని కాపాడేందుకు సైనికులు ఎలా నిరంతరం తన ప్రాణాలను సహితం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్నారు అలాగే సమాజంలో ప్రజల ధన,మాన ,ప్రాణలకు రక్షణ కల్పిస్తూ ప్రజలు తమ ఇళ్లలో సుఖంగా నిద్రించడానికి మేమున్నాము అన్న భరోసా కల్పిస్తున్నది మన పోలీసు సోదరులని నేను గర్వంగా చెప్పగలను.
పోలీసు ఉద్యోగం అత్యంత కష్టమైనదని సమాజంలో చట్ట వ్యతిరేక శక్తులను అణిచివేసేందుకు కృషి చేస్తూ శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు చేస్తున్న సేవ ఎంతో గొప్పది. సమాజంలో సోషల్ మీడియా ప్రభావం అధికం కావడం వలన పోలీసులు వారి విధి నిర్వహణలో ఒత్తిడికి గురవుతూ విధులు నిర్వహించడం అత్యంత కష్టతరమైనదన్నారు.

# కొత్తపల్లిలో కాకర పంట నష్టం.

**- రెండు లక్షల మేర నష్టపోయిన రైతు ఆవేదన.**







**ఆంధ్ర ప్రగతి డోన్ అక్టోబర్ 21:** నంద్యాల జిల్లా డోన్ మండలం యూ కొత్తపల్లి గ్రామంలో మంగళవారం అకాల వర్షం ఒక రైతు జీవితంలో చేదు జ్ఞాపకాన్ని మిగిల్చింది. గ్రామానికి చెందిన రైతు పాల చంద్రమోహన్ ఎంతో శ్రమతో సాగు చేసిన కాకర పంట కోతకు సిద్ధంగా ఉండగా, వర్షం రూపంలో వచ్చిన విపత్తు ఆ శ్రమను నిమిషాల్లో నేలమట్టం చేసింది. ఆకస్మికంగా కురిసిన భారీ వర్షానికి పంట పందిరి పూర్తిగా కూలిపోగా, కోతకు సిద్ధంగా ఉన్న కాకర పంట మొత్తం పాడైపోయింది. ఈ ఘటనతో చంద్రమోహన్‌కు సుమారు రెండు లక్షల రూపాయల ఆర్థిక నష్టం సంభవించినట్లు తెలుస్తోంది."ఏళ్ల తరబడి ఇంత మంచి పంట రాలేదు. ఈ సారి మంచి రేటు దొరుకుతుందని ఆశపడ్డాం. కానీ చేతికి అందిన పంట ఇలా వర్షం కారణంగా నష్టపోవడం చాలా బాధగా ఉంది," రైతు అని ఆవేదన వ్యక్తం చేశారు.

# వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్లక్ష్యం.

**మధ్యాహ్నం డాక్టర్ లేరు - రోగులు ఎదురుచూపులు.**




**ఆంధ్ర ప్రగతి వెల్దుర్తి అక్టోబర్ 21:**
కర్నూలు జిల్లా వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు పట్ల తీవ్రమైన నిర్లక్ష్యం కొనసాగుతోంది. మధ్యాహ్నం సమయంలో ఆసుపత్రిలో ఒక్క డాక్టర్ కూడా లేని పరిస్థితి నెలకొంది. ఉదయం సమయంలో మాత్రమే బ్లడ్ టెస్టులు చేస్తామని సిబ్బంది చెబుతుండగా, మధ్యాహ్నం నుంచి పరీక్షలు నిలిపివేస్తున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈరోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఇప్పటి వరకు డాక్టర్ ఎవరూ లేని కారణంగా పేషెంట్లు నిరాశకు గురవుతున్నారు. ఆసుపత్రి వద్ద పరీక్షల కోసం వచ్చిన వారు, వైద్యం కోసం వేచి చూసే పరిస్థితి నెలకొంది.ఒకవైపు వెల్దుర్తి మండలంలో డెంగ్యూ జ్వరాలు విజృంభిస్తున్న సమయంలో ప్రభుత్వ ఆసుపత్రి ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రజల్లో ఆగ్రహానికి కారణమవుతోంది. స్థానికులు తక్షణమే వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# శక్తి యాప్, ఫోక్స్ చట్టంపై అవగాహన అవసరం.

**సీఐ- దస్తగిరి బాబు. -ఎస్సై చిన్న పిరయ్య.**




**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ళ అక్టోబర్ 21:** (యర్రగుంట్ల)-మండల పరిధిలోని యర్రగుంట్ల మేజర్ పంచాయతీ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిఐ దస్తగిరి బాబు, ఎస్సై చిన్న పిరయ్య శక్తి యాప్ గురించి విద్యార్థి, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. శక్తి యాప్, ఫోక్స్ చట్టం ఇతర మహిళ చట్టాలపై, మధ్యక ద్రవ్యాలపై అత్యవసర సమయంలో వినియోగించవలసిన టోల్ ఫ్రీ నెంబర్ గురించి సైబర్ క్రైమ్ నేరాలు, బాల వివాహాలపై కలిగే నష్టాలు ఈవ్ టీజింగ్, క్రికెట్ బెట్టింగ్,, డ్రగ్స్ వాడకం వల్ల కలిగి నష్టాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి విద్యార్థులకు తెలిపారు.మహిళలు, చిన్నారుల భద్రత కోసం ఏర్పాటుచేసిన శక్తి యాప్ ఎంతో ఉపయోగపడుతుందనీ వివరించరు. ఏపీ పోలీస్ శాఖ తీసుకొచ్చిన శక్తి యాప్ ను ఫోన్లో డౌన్లోడ్ మరియు రిజిస్ట్రేషన్ చేసుకొని ఎస్ ఓ ఎస్ ఆప్షన్ నొక్కితే నిమిషాల్లో పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి రక్షిస్తారని అన్నారు. ఒంటరిగా ప్రయాణం చేసేటప్పుడు శక్తి యాప్ షేప్ ట్రావెల్ ఆప్షన్ ఎంచుకుంటే చాలు, ధీమాగా, ధైర్యంగా సురక్షితంగా గమ్య స్థానానికి చేరుకోవచ్చు అన్నారు.
సెల్ఫోన్లో శక్తి ఆప్ ఉంటే ఎప్పుడు ధైర్యంగా ఉండవచ్చునున్నారూ. బాల్య వివాహాలు కు సంబంధించి 1098, సైబర్ క్రైమ్ కు సంబంధించి 1930, ఎనీ ఎమర్జెన్సీ 100,112 నెంబర్లకు కాల్ చేసి మహిళలు సహాయం పొందవచ్చునని తెలిపారు.

# విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయం

**పోలీసు సేవలు సమాజానికి ఆదర్శం. -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**







**ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 21:**
పోలీసులు సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తూ ప్రాణాలను తృణప్రాయంగా భావించి ప్రజల రక్షణ కోసం త్యాగం చేసిన పోలీసు అమరవీరులను స్మరించుకోవడం ఎంతో గర్వించదగ్గ విషయమని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారిపేర్కొన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయం (బొమ్మలసత్రం)లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలు జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథులుగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి అమ్మన్నరాజు తదితరులు హాజరయ్యారు. ముందుగా పెరేడ్ కమాండర్ జి. బాబు గారి వద్ద నుండి జిల్లా కలెక్టర్, ఎస్పీ గార్లు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఏ ఆర్ డి ఎస్ పి శ్రీనివాసరావు విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల వివరాలను అందరికీ తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం అత్యంత కష్టతరమైనదని, పగలు–రాత్రి, ఎండ–వాన తేడా లేకుండా విధులు నిర్వర్తించడం పోలీసుల నిత్యజీవితంలో భాగమని అన్నారు. సమాజంలో శాంతిభద్రతలను కాపాడుతూ ప్రజలకు రక్షణ కల్పించడమే కాకుండా, తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ కుటుంబ బాధ్యతలను సమన్వయపరచడం ఎంతో సవాలుగా ఉంటుందని పేర్కొన్నారు. టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ కాలంలో సైబర్ నేరాలను అరికట్టడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేసి, పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను ఓర్పుతో విని, పరిష్కరించేందుకు కృషి చేయాలని అన్నారు. జిల్లాలో కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి సంవత్సరం నాలుగు నెలలు



పూర్తయిన నేపథ్యంలో పోలీసు శాఖ అందించిన సహకారం విశేషమని, వారి కృషి జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కీలకమైందని కలెక్టర్ ప్రశంసించారు.
జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం ఎంతో కష్టసాధ్యమైనదని, ఎండ, వాన, చలి, పగలు–రాత్రి తేడా లేకుండా ప్రజల భద్రత కోసం పోలీసు సిబ్బంది నిరంతరం విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఇటీవల విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన హైదరాబాద్‌కు చెందిన కానిస్టేబుల్‌ను స్మరించుకుంటూ, పోలీసుల సేవలు సమాజ రక్షణలో అపారమైనవని పేర్కొన్నారు. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్‌స్ప్రింగ్ ప్రాంతంలో చైనా దాడిని ఎదుర్కొంటూ వీరమరణం పొందిన 10 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు పోలీసు అమరవీరుల దినోత్సవానికి ప్రేరణగా నిలిచారని గుర్తు చేశారు. స్వాతంత్ర్యం తర్వాత దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు సిబ్బందిని స్మరించుకుంటూ, ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అమరవీరుల కుటుంబాలను ఆదర్శంగా తీసుకుని, వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎస్పీ స్పష్టం చేశారు.మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి అమ్మన్నరాజు మాట్లాడుతూ విధి నిర్వహణలో అమరులైన పోలీసు సోదరులను స్మరించుకోవడం, వారి కుటుంబ సభ్యులను సన్మానించడం అత్యంత గర్వించదగ్గ విషయమన్నారు. దేశ సరిహద్దుల్లో సైనికులు ఎలా ప్రజల రక్షణ కోసం పోరాడతారో, సమాజంలో చట్ట–వ్యవస్థ పరిరక్షణలో పోలీసుల పాత్ర కూడా అంతే గొప్పదని పేర్కొన్నారు. సోషల్ మీడియా ప్రభావం పెరిగిన నేపథ్యంలో పోలీసు విధులలో ఒత్తిడి ఎక్కువవుతున్నా, పోలీసులు సమాజ శాంతి–భద్రతల పరిరక్షణలో అచంచలంగా కృషి చేస్తున్నారని ప్రశంసించారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

## ప్రభుత్వ మద్దతు ధర చెల్లించాలి.

**ఈనెల 23న నంద్యాల కలెక్టర్ కార్యాలయం దగ్గర జరిగే ధర్నాను జయప్రదం చేయాలి**

**- ఏపీ రైతు సంఘం రైతులకు పిలుపు**




**ఆంధ్ర ప్రగతి డోన్ అక్టోబర్ 21:**
మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు 2400 రూపాయలు చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లంకా సుబ్బరాయుడు,సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పి.రామాంజనేయులు, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి.శివరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వీటి సాధన కొరకు ఈనెల 23న నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం దగ్గర జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతులకు పిలుపునిచ్చారు.మంగళవారం స్థానిక కొండపేటలోని సిఐటియు కార్యాలయంలో వారు మాట్లాడుతూ జిల్లాలో వరి,మొక్కజొన్న, సోయాబీన్స్,మినుములు, పత్తి,మిర్చి,ఉల్లి,కంది, శనగ,పొగాకు తదితర పంటలు పండిస్తున్న రైతులు ఎకరాకు 30 వేల రూపాయల నుంచి లక్ష రూపాయల దాకా అప్పులు చేసి మరీ పెట్టుబడులు పెడుతున్నారని ఒకవైపు అతివృష్టి అనావృష్టి లాంటి ప్రకృతి వైపరీత్యాలకు గురి అవుతున్నారని మరోవైపు ప్రైవేటు వ్యాపారస్తులు దళారులు రైతులను నిలువునా దోచుకుంటుంటే పాలకులు అధికారులు మాత్రం తమకు సంబంధం లేదన్నట్లుగా గుడ్లప్పగించి చూస్తున్నారు తప్ప ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.రైతులు పండించిన పంటలకు మాత్రమే ఇటువంటి దుస్థితి ఉన్నదని అదే రైతులకు కావలసినటువంటి విత్తనాలు,రసాయనిక ఎరువులు,నీళ్ల మందులు,వ్యవసాయ పనిముట్ల ధరలు మాత్రం హద్దు అదుపు లేకుండా పెరిగిపోతున్నా వీటిని అదుపు చేసే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లాలో వరి పంట తర్వాత 1,54,010 లక్షల ఎకరాలలో మొక్కజొన్న పంటను విస్తారంగా వేశారని అయితే ఆగస్టు నెల నుంచి కురుస్తున్న వర్షాలకు చేతికి వచ్చిన పంట నీటి పాలు అవుతున్నదని కొద్దో గొప్పో మిగిలిన పంటను అమ్ముకుందామంటే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర 2400 రూపాయలకు కూడా వ్యాపారస్తులు కొనే పరిస్థితులు లేవని ఇప్పటికైనా ఎమ్మెల్యేలు ఎంపీలు జిల్లా మంత్రులు జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకొని ముఖ్యమంత్రి గారితో చర్చించి అన్ని మండల కేంద్రాలలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయాలని అదేవిధంగా వర్షాలకు తడిసిన మొక్కజొన్న ఆరబెట్టుకొనుటకు రైతులందరికీ టార్పాలియన్స్ ఉచితంగా ఇవ్వాలని,ఈ క్రాప్ బుకింగ్ తో నిమిత్తం లేకుండా రైతులు,కౌలు రైతుల దగ్గర ఉన్న పంటను కొనుగోలు చేయాలని,అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు ఎకరాకు 40,000 రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పైడిమాండ్ల సాధన కొరకు కలెక్టరేట్ దగ్గర జరిగే ధర్నాను జయప్రదం చేయాలని రైతులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.రామమోహన్,ఎర్రగుంట్ల గ్రామ కమిటీ కార్యదర్శి ఎ.రాజు,మాధవరం గ్రామ రైతు టి.ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా సంతకాల సేకరణ.

**ప్రజల సొమ్ముతో మోడీ సొంత భజన చేయించుకుంటున్నారు. -ప్రజాస్వామ్యం విలువను అవమానిస్తున్న బీజేపీ ప్రభుత్వం.**

**డోన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త, న్యాయవాది డాక్టర్ గార్లపాటి మద్దులేటీ స్వామి.**

**- నంద్యాల డిసిసి ఉపాధ్యక్షులు అడ్మిన్ న్యాయవాది ఉన్ని గొర్ల జనార్ధన్.**





**ఆంధ్ర ప్రగతి డోన్ అక్టోబర్ 21:**
ఏఐసీసీ %ఆ% పీసీసీ ఆదేశాల మేరకు డోన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త, న్యాయవాది డాక్టర్ గార్లపాటి మద్దులేటీ స్వామి, నంద్యాల డిసిసి ఉపాధ్యక్షులు అడ్మిన్ న్యాయవాది ఉన్ని గొర్ల జనార్ధన్ ల ఆధ్వర్యంలో ఓట్ చోర్ గద్ది చోడ్ (ఓట్లు దొంగ గద్దె దిగు) అనే నినాదముతో రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా డోన్ లో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టడం జరిగింది.ఈ కార్యక్రమానికి డోన్ సిపిఎం నాయకులు నక్కి శ్రీకాంత్ పాల్గొని సంపూర్ణ మద్దతు తెలియచేసారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ఓట్ చోరీ కి పాల్పడి ప్రజాస్వామ్యం విలువను అవమానిస్తూ మూడోసారి గద్దెక్కారు 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును పొందాలనేది కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమని,ప్రజలు జవాబుదారీగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో. ప్రజలు పలు డిమాండ్లను కేంద్ర ఎన్నికల సంఘం ముందు పెడుతున్నామని అన్నారు.
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, ప్రజలకు న్యాయం జరగాలంటే కావాల్సింది జిఎస్టి ఉత్సవాలు కాదు.. "ప్రత్యేక హోదా"హోదానే రాష్ట్ర అభివృద్ధికి సంజీవని అని,2014లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రత్యేక హోదా హామీ అమలైవుంటే నేడు దేశంలోనే రాష్ట్రం అగ్రస్థానంలో ఉండేదని,జి ఎస్ టి అంటే గబ్బర్ సింగ్ ట్యాక్స్ అని జి ఎస్ టి పేరుతో 2017-18 నుంచి 2024-25 మధ్య 8 ఏళ్లలో రూ.55,44,897 కోట్లుదోపిడీ చేశారని,,ఇప్పుడు 2.%ూ% సంస్కరణల పేరుతో రూ.2.5 లక్షల కోట్లు మాత్రమే తగ్గించారని,ఇన్నాళ్లు ఎడాపెడ పన్నుల మోత మోగించి, సామాన్యుల నడ్డి విరిచిన మోడీ గారు,గోరంత ట్యాక్సులు తగ్గించి కొండంత చెప్పుకుంటున్నారని ఈ తగ్గింపుతో ప్రజల కొనుగోలు శక్తి పెరిగిందనేది పచ్చి అబద్ధమని,వారు విమర్శించారు. ఈ కార్యక్రమం లో సిపిఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్,నంద్యాల డిసిసి ప్రధానకార్యదర్శి (ఆర్గనైజేషన్)వడ్డే రాజశేఖర్, డిసిసి కార్యదర్శి ఆర్. గోపినాథ్ రావ్, ప్యాపీలి మండల అధ్యక్షులు ఎస్. మహేంద్ర నాయుడు,డోన్ మండల అధ్యక్షులు పఠాన్ మహబూబ్ హుస్సేన్,డోన్ పట్టణ ఉపాధ్యక్షులు హనుమాన్,బేతంచెర్ల కాంగ్రెస్ నాయకులు షాషావలి, మొహిద్దీన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జి. నాగన్న, గిడ్డయ్య, అప్పన్న, బాలదస్తగిరి, వెంకటేశ్వర్లు,తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

## -మంత్రి టీజీ భరత్



**కర్నూలు అక్టోబర్ 21ఆంధ్ర ప్రగతి**
పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా స్మృతి పరేడ్ నిర్వహించారు. అమరవీరుల స్థూపానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి శ్రీ టీజీ భరత్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ జాయింట్ కలెక్టర్ నూరల్ కమర్ ఐఏఎస్ ఘనంగా నివాళులు అర్పించారు.
మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ,
దేశ, రాష్ట్ర శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయాలు. 01.09.2024 నుండి 31.08.2025 వరకు దేశవ్యాప్తంగా 191 మంది పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో వీరమరణం పొందారు. ఆంధ్రప్రదేశ్‌లో ఐదుగురు ప్రాణత్యాగం చేశారు" అన్నారు.పోలీసులు ప్రజల రక్షణ కోసం తమ జీవితాన్ని పణంగా పెడుతున్నారు. వారి త్యాగాలు ఎప్పటికీ మరువలేము" అని తెలిపారు.జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి మాట్లాడుతూ, అక్టోబర్ 21వ తేదీని దేశమంతా పోలీసు అమరవీరుల దినోత్సవంగా గుర్తుంచుకోవాలి. ఒక పోలీసు ప్రాణత్యాగం అనేది అత్యున్నత సేవ" అని పేర్కొన్నారు.
జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ, 1959 అక్టోబర్ 21న లఢాఖ్‌లో చైనా దాడిలో వీరమరణం పొందిన సిఆర్పిఎఫ్ జవాన్ల స్మరణార్థమే ఈ దినోత్సవం ప్రారంభమైంది. దేశ రక్షణలో పోలీసుల త్యాగాలు అజరామరమైనవి" అన్నారు.
జాయింట్ కలెక్టర్ నూరల్ కమర్ మాట్లాడుతూ, పోలీసు వ్యవస్థ అత్యంత కష్టతరమైనది. వారు ఎల్లప్పుడూ ప్రజల భద్రత కోసం ముందుంటారు. వారి సేవలు అందరికీ ఆదర్శం" అన్నారు. కార్యక్రమంలో దేశవ్యాప్తంగా అమరులైన 191 మంది పోలీసుల పేర్లు అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా చదివి వినిపించారు. అనంతరం 2 నిమిషాల మౌనం పాటించి, కర్నూలు జిల్లా అమరవీరుల కుటుంబ సభ్యులను (యుడి వెంకటేశ్వర్లు, అబ్దుల్ కరీం, కె. రాముడు) శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బస్తి పాటి నాగరాజు, కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, హోంగార్డు కమాండెంట్ ఎం. మహేష్ కుమార్, పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీవారికి వెల్లువెత్తిన విరాళాలు...

# 11 నెలల్లోనే రూ. 918 కోట్లు!



తిరుమల **అక్టోబర్ 21ఆంధ్ర ప్రగతి**
తిరుమల శ్రీవారి భక్తులు తమ దాతృత్వాన్ని మరోసారి చాటుకున్నారు. టీటీడీ ఆధ్వర్యంలో నడిచే వివిధ ట్రస్టులకు గత 11 నెలల కాలంలో రికార్డు స్థాయిలో విరాళాలు వెల్లువెత్తాయి. 2024 నవంబర్ 1 నుంచి 2025 అక్టోబర్ 16వ తేదీ వరకు ఏకంగా రూ. 918.6 కోట్లు విరాళాలుగా అందినట్లు టీటీడీ వర్గాలు వెల్లడించాయి. ఈ విరాళాల్లో సింహభాగం శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకే దక్కింది. ఈ ఒక్క ట్రస్టుకే అత్యధికంగా రూ. 338.8 కోట్లు అందడం విశేషం. ఆ తర్వాతి స్థానాల్లో శ్రీవాణి ట్రస్టుకు రూ. 252.83 కోట్లు, శ్రీబాలాజీ ఆరోగ్య వరప్రసాదిని స్కీమ్‌కు రూ. 97.97 కోట్లు, ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ. 66.53 కోట్లు, ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు రూ. 56.77 కోట్ల చొప్పున భక్తులు కానుకలు సమర్పించారు.ఆసక్తికరంగా భక్తులు నేరుగా విరాళాలు అందించడం కన్నా ఆన్‌లైన్ ద్వారానే ఎక్కువగా తమ విరాళాలను అందిస్తున్నారు. మొత్తం విరాళాల్లో ఆన్‌లైన్ ద్వారా రూ. 579.38 కోట్లు రాగా, ఆఫ్‌లైన్ ద్వారా రూ. 339.20 కోట్లు అందాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీటీడీకి విరాళాలు అందించే దాతల సంఖ్య క్రమంగా పెరుగుతున్నట్లు తెలుస్తోంది.ఈ నేపథ్యంలో దాతలకు గౌరవం, సదుపాయాలు కల్పించాలని, వారి విషయంలో ఎలాంటి లోటుపాట్లు రాకూడదని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అధికారులను ఆదేశించారు. కేవలం నగదు రూపంలోనే కాకుండా, పలు నిర్మాణాలు, యంత్రాల కొనుగోలు, సాంకేతిక అభివృద్ధికి కూడా దాతలు తమ సహకారాన్ని అందిస్తున్నారని, రానున్న రోజుల్లో విరాళాలు మరింత పెరిగే అవకాశం ఉందని టీటీడీ వర్గాలు భావిస్తున్నాయి.

# సుందర్ పిచాయ్ భారత్‌లో పెట్టుబడులు

**తమిళనాడు రచ్చపై ఎక్స్ వేదికగా లోకేశ్ స్పందన**

అమరావతి, **అక్టోబర్ 21ఆంధ్ర ప్రగతి** గూగుల్ కంపెనీ ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్‌లో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్న క్రమంలో వస్తున్న విమర్శలను మంత్రి లోకేశ్ తిప్పి కొట్టారు. గూగుల్ కంపెనీ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడుతోంది. కొద్దిరోజుల క్రితం ఓ ఇంటర్వ్యూలో గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ మాట్లాడుతూ వైజాగ్‌లో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వైజాగ్‌ను అద్భుతమైన నగరం అంటూ ప్రశంసలు కురిపించారు. అయితే, ఏపీలో గూగుల్ కంపెనీ డేటా సెంటర్ ఏర్పాటు చేయటంపై తమిళనాడులో రచ్చ మొదలైంది. అధికార డీఎంకే, ప్రతిపక్ష ఏఐఏడీఎంకేల మధ్య రచ్చ జరుగుతోంది. రెండు పార్టీల నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు. సుందర్ పిచాయ్ తమిళ వ్యక్తి అయినప్పటికీ గూగుల్ పెట్టుబడులను ఏపీలో పెడుతున్నాడని, స్టాలిన్ సర్కార్ పెట్టుబడులు తేలేక పోయిందని ఏఐఏడీఎమ్‌కే విమర్శలు చేస్తోంది. తమిళనాడులో జరుగుతున్న ఈ రచ్చపై మంత్రి నారా లోకేష్ స్పందించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఓ వీడియోను షేర్ చేశారు. వీడియోలో ఏఐఏడీఎంకే నాయకుడు మాట్లాడుతూ.. 'గూగుల్ కంపెనీ ఆంధ్రాలో పెట్టుబడులు పెడుతోంది. ఆ గూగుల్ కంపెనీ సీఈఓ సుందర్ పిచాయ్ మన మధురైకి చెందిన వాడు. ప్రభుత్వం గూగుల్‌కు అవకాశం ఇచ్చి ఉంటే మన రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వచ్చేవి' అని అన్నారు. దీనిపై అధికార పార్టీ నాయకుడు స్పందిస్తూ..'జయ లలిత నిర్లక్ష్యం కారణంగానే చాలా కంపెనీలు ఆంధ్రాకు వెళ్లిపోయాయి' అని అన్నారు. డీఎంకే, ఏఐఏడీఎంకే నాయకుల కామెంట్లపై నారా లోకేష్ స్పందిస్తూ.. ' సుందర్ పిచాయ్ ఏపీని కాదు.. భారత్‌ను పెట్టుబడుల కేంద్రంగా ఎంచుకున్నారు' అని స్పష్టం చేశారు.

# అమరావతి నిర్మాణంలో అమృత్ పథకం

**281 పనులకు రూ.10,319. 93 కోట్ల నిధులు**

**ఆదేశాలు జారీ చేసిన మున్సిపల్ శాఖ**

అమరావతి, **అక్టోబర్ 21ఆంధ్ర ప్రగతి**:రాజధాని అమరావతి నిర్మాణంతోపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా పట్టణాల్లో తాగునీరు, డ్రైనేజీ సదుపాయాలను మెరుగు పరచడానికి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. అమృత్ 2.0 పథకం కింద 281 పనులకు రూ.10,319. 93 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు మున్సిపల్ శాఖ తెలిపింది. ఈ మేరకు మున్సిపల్ పరిపాలన శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ఏపీయూఎఫ్ఐడీసీ, పబ్లిక్ హెల్త్, గ్రీన్ బిల్డింగ్స్ కార్పొరేషన్లకు ఈ పనుల నిర్మాణంతోపాటు నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. మరోవైపు ఈ పనులు తీసుకునే సంస్థలు.. ఒప్పందం సమయంలో కొంత మొత్తం సెక్యూరిటీగా చెల్లించాలనే నిబంధనను విధించింది. ఈ పనులు సాగుతున్న సమయంలో ఈ నిధులు కట్ చేయకుండా మాఫీ చేసేందుకు అనుమతి సైతం ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం, పట్టణాల వాటా కోసం అవసరమైన నిధులను సేకరించేందుకు ఏపీయూఎఫ్ఐడీసీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇది రాష్ట్ర పట్టణాభివృద్ధి చరిత్రలోనే అతి పెద్ద పెట్టుబడి పెట్టిన ప్రాజెక్ట్‌గా రికార్డుల్లో నమోదవనుంది.అయితే మొత్తం ప్రాజెక్టు ఖర్చులో కేంద్రం రూ. 2, 470 కోట్లు.. రాష్ట్ర ప్రభుత్వం రూ.2, 490 కోట్లు విడుదల చేయనున్నాయి. ఇక ఫైనాన్స్ కమిషన్ నిధులు రూ. 925 కోట్లు విడుదల చేయనుంది. పట్టణాల వాటా రూ. 590 కోట్లుగా నిర్ణయించింది. అంతా కలిపి ప్రాజెక్టు క్యాపెక్స్ రూ.6, 477 కోట్లుగా.. దీనికి 10 ఏళ్ల నిర్వహణ ఖర్చు రూ.1, 499 కోట్లుగా నిర్ణయించింది. క వడ్డీ ఖర్చు కింద రూ. 2,344 కోట్లు భారం పడనుంది. ఈ మొత్తం ప్రాజెక్టు విలువ రూ.10, 319. 93 కోట్లు.

------

# కోనసీమ బాణాసంచా పేలుడు ఘటన


**మృతుల కుటుంబాలకు 15 లక్షల చొప్పున పరిహారం**

**సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశం**

అమరావతి, **అక్టోబర్ 21ఆంధ్ర ప్రగతి** అంబేద్కర్ కోనసీమ జిల్లా పేలుడు ఘటనలో మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున పరిహారం అందించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. సచివాలయంలో సీఎం చంద్రబాబుతో భేటీ అయిన హోం మంత్రి అనిత, అధికారులు సురేష్, ఆకే రవికృష్ణ బాణసంచా పేలుడు ఘటనకు సంబంధించిన నివేదికను సీఎంకు అందించారు. ఒకే షెడ్డులో ఒకే చోట 14 మంది కార్మికులు మెటీరియల్ మాన్యుఫ్యాక్చరింగ్ చేశారని, హార్డ్ మెటీరియల్ వాడటం వల్లే స్పార్క్ వచ్చి, మాన్యుఫ్యాక్చరింగ్ జరుగుతున్న ప్రాంతంపై పడిందని నివేదికలో అధికారులు పేర్కొన్నారు. ఏ మాత్రం నిబంధనలు పాటించలేదని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. నివేదికను పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, లైసెన్సు ఇచ్చే ముందు నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనేది అధికారులు నిరంతరం తనిఖీలు చేయాలని సూచించారు. తయారీ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. ఎక్స్ ప్లోజివ్ మెటీరియల్ పై నియంత్రణ కోసం ఇక నుంచి ఆన్ లైన్ ద్వారానే కొనుగోళ్లు జరిగేలా చూడాలన్న ముఖ్యమంత్రి బాణసంచా కోసం ఉపయోగించే పదార్థాల కొనుగోళ్లు, తయారీపై పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం లేని తయారీ కేంద్రాలను, ఆథరైజేషన్ లేని వాళ్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించొద్దని సీఎం పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే పీడీ యాక్ట్ కేసులు పెట్టి కఠినంగా వ్యవహరించాలని ఆదేశాలు జారీ చేశారు. బాణాసంచా తయారీ కేంద్రాలన్నీ నిబంధనల ప్రకారమే ఉండాలన్నారు. అలాగే, పనిచేసే వారికి వ్యక్తిగత బీమా ఉండాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# గూగుల్ లాంటి సంస్థలను స్వాగతించాల్సిందే !

విశాఖపట్నం, **అక్టోబర్ 21ఆంధ్ర ప్రగతి**
హైదరాబాద్ అభివృద్ధి, సైబరాబాద్ సృష్టి ఈ రెండు ఇవాళ తెలంగాణ గతినే మార్చాయి. ఐటి అభివృద్దితో హైదరాబాద్ ముఖచిత్రమే మారిపోయింది. రియల్ రంగంలో కొత్త పోకడలు వచ్చాయి. ఉమ్మడి ఏపిలో చంద్రబాబు పాలన ఎలా ఉన్నా, ఆయన ఏం చేసాడనే విమర్శలకు పోకుండా పరిశీలిస్తే... ఐటిని విస్తరించ డం కోసం తీసుకున్న నిర్ణయాలు ఇవాళ హైదరాబాద్‌ను అగ్రభాగాన నిలబెట్టాయి. హైటెక్ సిటీ రాకతో సైబరాబాద్ అనూహ్యంగా విస్తరించడం, అనేక దిగ్గజ కంపెనీలు హైదరాబాద్‌లో ఏర్పాటు కావడంతో లక్షల్లో ఉద్యోగాలు వచ్చాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా మరికొన్ని లక్షల మంది హైదరాబాద్‌లో ఉపాధి పొందుతున్నారు. ఇక్కడి 70శాతం ఆదాయంతోనే తెలంగాణ మనగులుగుతందనడంలో సందేహం లేదు. రియల్ ఎస్టేట్ అనూహ్యంగా విస్తరించింది. ఇది కాదనలేని సత్యం. ఇప్పుడు అమరావతి నిర్మాణం, విశాఖను ఐటి హబ్‌గా తీర్చిదిద్దేందుకు చంద్రబాబు చేస్తున్న కృషిని అభినందించాల్సిందే. ఎందుకంటే విడివడ్డ తెలుగు రాష్ట్రం అభివృద్ధి చెందడం తెలుగువారికి గర్వకారణంగా చూడాలి. అమరావతి, విశాఖలు అభివృద్ధి చెందితే అక్కడి స్థానికులకు కూడా లక్షల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. దీనిని రాజకీయాలకు అతీతంగా అందరం స్వాగతించాల్సిందే. వైకాపా ఐదేళ్ల పాలనలో అమరావతినే కాదు, రాజధానిని




తుంగలో తొక్కింది. మూడు రాజధానులంటూ అసలు రాజధాని లేకుండా చేశారు. ఇవాళ అదే వైకాప అమరావతిని, గూగుల్ రాకను వ్యతిరేకిస్తోంది. విశాఖలో అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ రావడం ఎంతో పురోగిమిస్తుందని, గూగుల్ సిఇవో సుందర్ పిచాయ్ స్వయంగా చెప్పారు. గూగుల్ సంస్థ డేటా సెంటర్ల ఏర్పాటుకు అమెరికాలోనూ భారత్‌లోనూ భారీగా పెట్టుబడులు పెడుతోంది. రాష్ట్రానికి పెట్టుబడు లు వస్తే చంద్రబాబుకు లేదా ఐటీ మంత్రి లోకేశ్‌కు వ్యక్తిగతంగా లాభం ఏమీ ఉంటుందా లేదా అన్నది ముఖ్యం కాదు. ఎందుకంటే పెట్టుబడుల ఫలితాలను ప్రజలు అనుభవిస్తారు. హైదరాబాద్ ఐటిరంగ విస్తరణెళి ఇందుకు నిదర్శనం. గూగుల్ సంస్థ రాకను మెచ్చుకోవాల్సిన వైకాపా నేతలు అదేపనిగా విమర్శలు చేయడం విడ్డూరంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో గూగుల్ గేమ్‌చేంజర్ అనే చెప్పవచ్చు. హైదరాబాద్ తో పోటీపడేలా విశాఖకు అవకాశాలు ఉన్నాయి. సంక్షేమం పేరిట ప్రభుత్వం అదేపనిగా ఉచిత పథకాలు ప్రవేశ పెట్టడం సరికాదు. ఇలాంటి సంస్థలను ప్రోత్సహించాలి. ఇలా వచ్చేవారికి తోడ్పాటును అందించాలి. చంద్రబాబుపై నమ్మకంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి మొదలైంది. గూగుల్ నిర్ణయం తర్వాత మరిన్న సంస్థలు రావచ్చు. ఇప్పటికే టిసిఎస్ కూడా తన క్యాంపస్ ప్రారంభించడానికి అంగీకరించింది. ఇదే ఒరవడి కొనసాగితే పెట్టుబడుల వెల్లువపెరుగుతుంది. అయితే జగన్ బృందం గూగుల్ సహా అనేక కంపెనీల రాకపై విమర్శలు చేస్తున్నది. పెట్టుబడులు రావడం, అభివృద్ధి జరగడం అన్నది ఎవరైనా స్వాగతించాల్సిందే. జగన్ అధికారంలో ఉండగా ఇలాంటి సంస్థల రాక అన్నది చూడలేదు.

అవినీతిని వ్యవస్థీకృతం చేసిన జగన్, కల్తీ మద్యం, ఊరూపేరు లేని బ్రాండ్లతో విచ్చలవిడి నకిలీ వ్యాపారం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులతోనే రాష్ట్రవ్యాప్తంగా కల్తీ మద్యం వ్యాపారం జరుగుతోందని అదే పనిగా ప్రచారం చేస్తున్నారు. నిజానికి కల్తీ మద్యం అమ్మకాలకు మాఫియా కారణం. దానివెనక రాజకీయ నేతలే ఉంటారు. ఇప్పుడు ఎపిలో పట్టుబడ్డ కల్తీకి రాజకీయ నేతలే అండగా ఉన్నారు. అందుకే కల్తీ సారా, కల్తీ మద్యం తాగి అడపాదడపా అనేకులు మరణిస్తూనే ఉంటారు. ఇప్పుడు కల్తీ మద్యం గురించి గగ్గోలు పెడుతున్న జగన్, ఆయన అనుచరులు గతంలో వారి పాలనలో కల్తీ మద్యం సరఫరా అన్నది ప్రభుత్వ పరంగానే చేశారు. జంగారెడ్డిగూడెంతో పాటు మరికొన్ని ప్రాంతాలలో ఆ మద్యం తాగి పలువురు
మరణించిన విషయం గుర్తించాలి. ములకలచెరువులో కల్తీ వ్యవహారం బయటకు రాగానే బాధ్యులందరినీ ప్రభుత్వం అరెస్టు చేసింది. వైసీపీకి చెందిన మాజీ మంత్రి జోగి రమేశ్ ప్రోద్బలంతోనే కల్తీ మద్యం తయారు చేశానని ప్రధాన నిందితుడు జనార్దనరావు చెప్పారు. ఇందులో నిజానిజాలు బయటికి వచ్చేలా కఠినంగా వ్యవహరించాలి. మద్యం కుంభకోణంలో సిట్ దర్యాప్తు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడం కూడా వారి లక్ష్యం కావచ్చు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపడంతో పాటు విపక్ష పార్టీగా వైకాపా అభివృద్ధిని కూడా స్వాగతించాలి. కానీ గూగుల్ లాంటి సంస్థల రాకను తప్పుపట్టడంమో, విమర్శించడమో సరికాదు. విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాగుపడాలంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగాలి. అనేక సంస్థలు రావాలి. గూగుల్ రావాలి, టిసిఎస్ ఇతర సంస్థలు రావాలి. ఎపిలో పెట్లుబడులు లక్ష్యంగా చేపట్టిన సిఐఐ సదస్సును విజయవంతం చేయాలి. అనేక సంస్థలు వచ్చి తమ కార్యలాపాలు సాగించేలా ప్రోత్సహించాలి. అందుకు అందరూ అభినందించాలి. అప్పుడే ఇక్కడ పెట్టుబడులు పెట్టేవారికి భరోసా కలుగుతుంది. అంతేకానీ వారిలో అపనమ్మకం కలిగేలా ఎవరు విమర్శలు చేసినా క్షంతవ్యం కాదు. అమెరికాలో తెలుగువారికి ఎసరు పెడుతున్న ట్రంప్ చర్యలతో ఇప్పుడక్కడ అనిశ్చితి నెలకొంది. మనవారికి ఇక్కడే ఉద్యోగాలు రావాలంటే గూగుల్ తదితర సంస్థలు రావాలి. అవి పోటీపడి తెలుగు రాష్ట్రాల్లో పెట్టుబడులు పెడితే మనం అమెరికా తదితరదేశాలకు వెళ్లాల్సిన ఆగత్యం ఉండదు.

# ఆపరేషన్ సిందూర్‌కు శ్రీరాముడే స్ఫూర్తి

## ఆయోధ్యలో రామాలయం తరవాత రెండో దీపావళి -ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు ,మోడీ ప్రస్తావన

న్యూఢిల్లీ, **అక్టోబర్ 21ఆంధ్ర ప్రగతి**
దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రజలను ఉద్దేశిస్తూ.. ప్రధాని నరేంద్ర మోదీ ఓ లేఖ రాశారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన.. ఆపరేషన్ సిందూర్ కు శ్రీరాముడే స్ఫూర్తి అని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ భారత ధర్మాన్ని కాపాడటంతో పాటు.. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకుందన్నారు. 'అయోధ్యలో రామాలయం నిర్మించిన తర్వాత ఇది రెండో దీపావళి. ధర్మాన్ని కాపాడాలని శ్రీరాముడు మనకు బోధించాడు. అన్యాయాన్ని ఎదుర్కొనే ధైర్యాన్ని ఇస్తాడు. కొన్ని నెలల క్రితం మనం చేపట్టిన ఆపరేషన్ సిందూరే దీనికి ఉదాహరణ. మనం భారత ధర్మాన్ని కాపాడటంతో పాటు ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకున్నాం. ఈ దీపావళికి మరో ముఖ్యమైన ప్రత్యేకత ఉంది. మావోయిస్టుల నుంచి విముక్తి పొందిన అనేక జిల్లాలతో పాటు మారుమూల ప్రాంతాల్లో కూడా దీపావళి వెలుగులు నిండాయి. మన దేశ రాజ్యాంగంపై విశ్వాసంతో అనేకమంది హింసా మార్గాన్ని విడిచిపెట్టి.. జన జీవన



స్రవంతిలోకి వచ్చిన అనేకమందిని మనం ఇటీవల చూశాం అని పేర్కొన్నారు. ఇది దేశానికి ఇది ఒక గొప్ప విజయం అని పేర్కొన్నారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఎస్టీ రేట్లను తగ్గించిన విషయాన్ని కూడా ప్రస్తావించారు. ఈ జీఎస్టీ రేట్ల తగ్గింపు కారణంగా ప్రజలకు పెద్ద మొత్తంలో లబ్ది చేకూరుతుందన్నారు. ఇక, పౌరులు స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలని మోదీ పిలుపునిచ్చారు. అన్ని భాషలను గౌరవించాలన్నారు. ప్రతిఒక్కరూ పరిశుభ్రతను పాటించాలన్నారు. మనం తీసుకునే ఆహారంలో నూనె వాడకాన్ని 10 శాతం తగ్గించి.. యోగాను ఆచరిద్దామన్నారు. ఈ ప్రయత్నాలన్నీ.. మనల్ని వికసిత్ భారత్ వైపు నడిపిస్తాయన్నారు. శక్తి, ఉత్సాహం నిండిన ఈ పండగ వేళ.. దేశ పౌరులందరికి ఆయన దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం దేశ పౌరులను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ లేఖ రాశారు. దసరా నవరాత్రులు ప్రారంభ వేళ.. జీఎస్టీ ధరలను భారీగా తగ్గించామన్నారు. ఇదంతా భవిష్యత్తు తరం కోసం సంస్కరణలలో భాగంగా వీటిని చేపట్టామన్నారు. ఈ సంస్కరణల కారణంగా దేశంలోని పౌరులకు రూ. వేల కోట్లు ఆదా చేయడానికి దోహదపడుతుందని తెలిపారు. అంతే కాకుండా ఈ నిర్ణయం జీవితాన్ని సులభతరం చేయడంతోపాటు ఆర్థిక వృద్ధిని పెంచుతుందన్నారు. ఇక భారత్, ఉత్తమ భారత్ స్ఫూర్తిని నిలబెట్టడం కోసం స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా దేశ ప్రజలకు ప్రధాని మోదీ విజ్ఞప్తి చేశారు. అన్ని భాషల పట్ల గౌరవం పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే ఆరోగ్యంపై అవగాహన సైతం కల్పించుకోవాలని కోరారు.

# పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేం

## అమరవీరుల సంస్మరణలో సిపి శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం, **అక్టోబర్ 21ఆంధ్ర ప్రగతి**
పోలీసులు లేని సమాజాన్ని మనం ఊహించలేమని విశాఖ సీపీ శంఖబ్రత బాగ్చిచెప్పుకొచ్చారు.విధి నిర్వహణలో అసువులుబాసిన పోలీస్ అమరవీరులకు జిల్లా కలెక్టర్, సీపీ, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ.. మరణింఇన వారికి నివాళిగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినం జరుపుకుంటూ వస్తున్నామని గుర్తుచేశారు. సమాజం సురక్షితంగా ఉంది అంటే పోలీసుల కృషి కారణమన్నారు. విపత్తు నిర్వహణ, ఎన్నికల విధి నిర్వహణతో పలు సందర్భాలలో



పోలీసులు విశేష సేవలు అందిస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో పోలీసుల పని తీరును తప్పక కొనియాడాలన్నారు. విశాఖనగరంలోని బీచ్‌రోడ్డులో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్,జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి, ప్రజా ప్రతినిధులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు. 2025వ సంవత్సరంలో దేశవ్యాప్తంగా 191 మంది పోలీసులు విధి నిర్వహణలో ప్రాణ త్యాగం చేశారని తెలిపారు. పోలీసుల మౌలిక వసతులకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. ఆరోగ్య పరిరక్షణ కోసం విశాఖ పోలీసులకు ప్రతి ఏటా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని సీపీ శంఖబ్రత బాగ్చిపేర్కొన్నారు.

# గూగుల్ రాకతో విశాఖకు మహర్దశ

## జగన్‌కు గూగుల్ రావడం ఇష్టం లేదు -బిజెపి అధ్యక్షుడు పి వి ఎన్ మాధవ్

విశాఖపట్నం, **అక్టోబర్ 21ఆంధ్ర ప్రగతి**
గూగుల్ ఎఐ డేటా సెంటర్ ఏర్పాటుతో ప్రపంచం మొత్తం మాట్లాడుకు నే ప్రత్యేక ప్రదేశంగా విశాఖ మారనుందని బిజెపి అధ్యక్షుడు పి వి ఎన్ మాధవ్ అన్నారు. దీనిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి వి ఎన్ మాధవ్ ఇవాళ విశాఖపట్నంలో ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాధవ్ పలు కామెంట్స్ చేశారు. ప్రపంచం మొత్తం మాట్లాడుకునే ప్రత్యేక ప్రదేశంగా విశాఖ మారిందన్న మాధవ్.. విశాఖ గ్లోబల్ కేపిటల్‌గా మారబోతుందని చెప్పారు. గూగుల్ ఎఐ హబ్ విశాఖకు రావడం గొప్ప పరిణామమని చెప్పిన మాధవ్.. ప్రతిపక్షాలు ప్రగతిని ఓర్వలేక మాట్లాడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని మాధవ్ విమర్శించారు. ప్రియాంక్ ఖర్గే.. స్కెవింజింగ్,



పెరసైట్ పదాలు ఉపయోగించడం దారుణమని మాధవ్ అన్నారు. వైసీపీ విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటును స్వాగతించడం లేదన్నారు. జగన్మోహన్ రెడ్డికి విశాఖకు గూగుల్ పెట్టుబడులు రావడం ఇష్టంలేదనిపిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. 'గూగుల్‌ను స్వాగతిస్తూ జగన్ కనీసం ఒక్క ట్వీట్ కూడా చేయలేదు. గూగుల్ ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు వస్తుంటే వైసీపీ ఎందుకు స్వాగతించడం లేదో సమాధానం చెప్పాలి. ప్రపంచంలో దిగ్గజ సంస్థలకు 40 శాతం సర్వీస్ ప్రొవైడర్లుగా తెలుగువారు ఉన్నారు. విశాఖ కేంద్రంగా యువతకు మంచి అవకాశాలు రాబోతున్నాయి. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పెట్టుబడులు పెద్ద మొత్తంలో వస్తున్నాయి. సెమి కండక్టర్స్ కు ఏపి కేపిటల్ గా మారబోతుంది. గూగుల్.. అమెరికా వెలుపల పెద్ద
మొత్తంలో విశాఖలోనే పెట్టుబడులు పెడుతోంది. విశాఖలో 1.3 లక్షల కోట్లతో గూగుల్ అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటు చేస్తుంది. విశాఖలో నూతన శకం ప్రారంభం కాబోతుంది. ఇప్పటికే సీపీ డేటా సెంటర్, ఓపెన్ కేబుల్ లాండింగ్ స్టేషన్ కు శంకుస్థాపన చేసుకున్నాము.' అని మాధవ్ చెప్పారు.

# భీమవరం డీఎస్పీ జయసూర్యపై నివేదిక

## తరచూ సివిల్ వివాదాల్లో తలదూర్చడంపై ఆగ్రహం

## ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడిని డిప్యూటి సిఎం పవన్





అమరావతి **అక్టోబర్ 21ఆంధ్ర ప్రగతి)** భీమవరం డీఎస్పీ జయసూర్య వ్యవహారాలపై పశ్చిమ గోదావరి ఎస్పీతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చర్చించారు. సివిల్ తగాదాల్లో తలదూరుస్తున్న డిఎస్పీపై నివేదిక ఇవ్వాలని ఎస్పీని ఆదేశించారు. డీఎస్పీ జయసూర్యపై పవన్ కళ్యాణ్‌కు తరచూ ఫిర్యాదులు వెళ్లాయి. పేకాట శిబిరాలు పెరిగిపోయాయని, సివిల్ వివాదాలలో జయసూర్య జోక్యం చేసుకొంటున్నారని, కొందరి పక్షం వహిస్తూ కూటమి నేతల పేరు వాడుతున్నట్లు పవన్‌కు ఫిర్యాదులు వచ్చాయి. ఈ అంశంపై వెంటనే చర్యలు ఉపక్రమించారు పవన్. పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీతో దీనిపై ఫోన్‌లో చర్చించారు. డీఎస్పీకి సంబంధించిన వ్యవహారంపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. డీఎస్పీ జయసూర్యపై వచ్చిన ఫిర్యాదుల విషయాన్ని ప్రస్తావించి అతడి వ్యవహారశైలిపై నివేదిక పంపించాలని ఎస్పీకి పవన్ ఆదేశాలు జారీ చేశారు.అసాంఘిక వ్యవహారాలకు డీఎస్పీ స్థాయి అధికారి అండగా ఉండటాన్ని తీవ్రంగా పరిగణించాలన్నారు. పోలీసులు సివిల్ వివాదాల్లో తలదూర్చకుండా చూడాలని ఎస్పీకి ఉపముఖ్యమంత్రి సూచించారు. ఇలాంటి వ్యవహారాలను కూటమి ప్రభుత్వం ఉపేక్షించదనే విషయాన్ని సిబ్బందికి తెలియజేయాలని తెలిపారు. ప్రజలందరినీ సమదృష్టితో చూసి శాంతి భద్రతలను పరిరక్షించాలని పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీకి పవన్ కళ్యాణ్ ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు.

# బంగాళా ఖాతంలో అల్పపీడనం

హైదరాబాద్, **అక్టోబర్ 21ఆంధ్ర ప్రగతి**
తెలంగాణలో రాగల ఐదురోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ హెచ్చరించింది. నైరుతి బంగాళాఖాతం ప్రాంతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ఇవాళ ఉదయం అల్పపీడనంగా మారిందని పేర్కొంది. పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ బుధవారం మధ్యాహ్నం నాటికి ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాలకు ఆనుకొని ఉన్న నైరుతి, పశ్చిమ వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే ఛాన్స్ ఉందని చెప్పింది. ఆ తర్వాత పశ్చిమ-వాయువ్య దిశగా కదిలి ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్ర వైపు కదులుతూ 24గంటల్లో మరింత బలపడే అవకాశాలున్నాయని తెలిపింది. ఈ క్రమంలో తెలంగాణలో ఐదురోజులు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది. కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడే సూచనలున్నాయని చెప్పింది. బుధవారం కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది.

# నఖ్వీపై చర్యలు తీసుకోనున్న బీసీసీఐ!!



ఆసియా కప్ ముగిసి చాలా కాలమైంది. ఇంత వరకు ట్రోఫీ మాత్రం భారత్‌కు రాలేదు. తన చేతుల మీదుగా తీసుకోలేదని మొండికేసిన ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ భారత్‌కు ట్రోఫీ ఇచ్చేందుకు అంగీకరించలేదు. తనతోపాటే తీసుకెళ్లిపోయారు. దీంతో ఈ వివాదం ఇంకా ముగిసిపోలేదు. భారత్ పలు రకాలుగా ఆయన్ని సంప్రదిస్తుంటే షరతులతో ఇచ్చేందుకు అంగీకరించారు. తన చేతుల మీదుగా తీసుకుంటేనే ఇస్తానని చెబుతున్నారు. దీంతో భారత్ మరిన్ని చర్యలు సిద్ధమవుతోంది. ట్రోఫీ వివాదంలో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో, బీసీసీఐ తదుపరి ఐసీసీ సమావేశంలో ఈ విషయంలో అంతర్జాతీయ బోర్డు జోక్యం చేసుకోవాలని కోరవచ్చు. బీసీసీఐ గత వారంలో ఒక లేఖను పంపిందని సమాచారం, అందులో ట్రోఫీని భారత జట్టుకు ఇవ్వాలని కోరారు, అయితే నఖ్వీ నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. టీమ్ ఇండియాకు ట్రోఫీని ఇవ్వాలి లేదా త్వరలో జరగనున్న ఐసీసీ సమావేశంలో ఈ సమస్యను లేవనెత్తుతామని బీసీసీఐ స్పష్టం చేసింది. ఏషియా కప్ ట్రోఫీ ప్రస్తుతం దుబాయ్‌లో ఉంది, అక్కడ అది ఏషియన్ క్రికెట్ కౌన్సిల్ కార్యాలయంలో ఏసీసీ ఉంచారు. ఒక మీడియా నివేదికలో, బీసీసీఐకార్యదర్శి దేవ్జిత్ సైకియా మాట్లాడుతూ, భారత బోర్డు చట్టపరంగా ఒక్కో అడుగు వేస్తోందని చెప్పారు. ఏషియా కప్ ఫైనల్‌లో భారత జట్టు పాకిస్తాన్‌పై 5 వికెట్ల తేడాతో విజయం సాధించిన తర్వాత మొహ్సిన్ చేతుల మీదుగా ట్రోఫీని తీసుకోడానికి నిరాకరించడంతో ఈ వివాదం ప్రారంభమైంది. కొంత సమయం తరువాత, మొహ్సిన్ నఖ్వీ ట్రోఫీని తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొన్ని వారాల క్రితం సెప్టెంబర్ 30న ఏసీసీ సమావేశం జరిగింది, ఆ సమావేశంలో రాజీవ్ శుక్లా భారతదేశానికి ప్రతినిధిగా ఉన్నారు, అతను ప్రస్తుతం బీసీసీఐ ఉపాధ్యక్షుడు కూడా. ఆ సమావేశంలో రాజీవ్ శుక్లా మాట్లాడుతూ ట్రోఫీ ఏషియన్ క్రికెట్ కౌన్సిల్ ఆస్తి అని, కాబట్టి నఖ్వీ వ్యక్తిగతంగా ట్రోఫీని మైదానం నుంచి తీసుకెళ్లే హక్కు లేదని అన్నారు. బోర్డు సభ్యుల ముందు క్షమాపణ చెప్పిన తర్వాత కూడా, అతను టీమ్ ఇండియాకు ట్రోఫీని ఇవ్వడానికి నిరాకరించాడు. టీమ్ ఇండియా ట్రోఫీని తీసుకెళ్లాలనుకుంటే, వారు నేరుగా దుబాయ్‌లోని కార్యాలయానికి వచ్చి అతని చేతుల మీదుగా ట్రోఫీని తీసుకోవాలని ఆయన షరతులు పెడుతున్నారు. వీటికి టీమిండియా, బీసీసీఐ అంగీకరించడం లేదు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్ అమాయకులైన ప్రజలను పొట్టన పెట్టుకుంటుందని, జమ్ముకశ్మీర్‌లో జరిగిన దాడులు ఉదాహరణగా చూపిస్తూ ఆసియా కప్‌లో పాకిస్తాన్ క్రికెటర్లతో మాట, చేతులు కలపడానికి నిరాకరించింది. అంతేకాకుండా ఆ దేశానికి చెందిన నఖ్వీ చేతుల మీదుగా కూడా ట్రోఫీ అందుకోలేదు. దీన్ని మనసులో పెట్టుకొనే నఖ్వీ తనకు నచ్చినట్టు చేస్తున్నారు. ట్రోఫీని భారత్‌కు ఇవ్వకుండా అడ్డం పడుతున్నారు.

# టీమ్ఇండియాకు చివరి ఛాన్స్




ఉమెన్స్ వన్డే వరల్డ్‌కప్‌లో ఉత్కంఠ భరిత వాతావరణం నెలకొంది. ఇప్పటికే మూడు జట్లు సెమీస్ బర్త్ ఖాయం చేసుకున్నాయి. ఇక మిగిలిన ఒక స్థానం కోసం ఐదు జట్ల మధ్య హెూరాహెూరీ పోరు సాగుతోంది. ఈ క్రమంలో వరుసగా మూడు పరాజయాలు ఎదుర్కొన్న టీమ్ఇండియా మహిళల జట్టు తన సెమీస్ అవకాశాలను క్లిష్ట పరిస్థితుల్లోకి నెట్టుకుంది. టీమ్ఇండియా ఇప్పటివరకు ఆడిన 5 మ్యాచ్‌ల్లో 2 గెలిచి, 4 పాయింట్లతో పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. ఇక ముందున్న రెండు మ్యాచ్‌లు భారత్‌కు అత్యంత కీలకం. అక్టోబర్ 23న న్యూజిలాండ్‌తో, అక్టోబర్ 26న బంగ్లాదేశ్‌తో తలపడనుంది. సెమీఫైనల్ ఆశలను నిలబెట్టుకోవాలంటే ఈ రెండు మ్యాచ్‌ల్లో తప్పక గెలవాల్సిందే! ఒక మ్యాచ్ గెలిచి, మరోదాంట్లో ఓడినా టీమ్ఇండియాకు ఇంకా అవకాశం ఉంది! కానీ అది పూర్తిగా రేసులో ఉన్న ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడి ఉంటుంది. ఆ జట్ల కంటే మెరుగైన నెట్ రన్‌రేట్ సాధిస్తేనే భారత్ సెమీస్ బరిలో నిలుస్తుంది. అయితే, రెండు మ్యాచ్‌ల్లోనూ ఓటమి చవిచూస్తే సెమీస్ కల దాదాపు చెదిరినట్టే!ఇక టీమ్ఇండియాకు ఒక్క సానుకూల అంశం ఏంటంటే రన్‌రేట్ పాజిటివ్‌గా ఉండటం. న్యూజిలాండ్ ఇప్పటివరకు ఒకే మ్యాచ్‌లో విజయం సాధించినా, మరో రెండు మ్యాచ్‌ల ఫలితాలు తేలకపోవడంతో వారి ఖాతాలో నాలుగు పాయింట్లు చేరాయి. అయితే కివీస్ తమ తర్వాతి రెండు మ్యాచ్‌ల్లో గెలిస్తే మాత్రం భారత్‌ను వెనక్కి నెట్టి సెమీస్ రేసులో ముందంజలోకి వచ్చేయొచ్చు! సోమవారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక విజయం సాధించింది. ఈ విజయం త శ్రీలంక ఖాతాలో 4 పాయింట్లు చేరాయి. చివరి మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై గెలిస్తే, శ్రీలంక కూడా సెమీస్ రేసులోకి చేరే అవకాశం ఉంది. పాయింట్ల పట్టికలో చివరి స్థానాల్లో ఉన్న బంగ్లాదేశ్, పాకిస్థాన్ జట్లు సెమీస్ రేస్ నుంచి దాదాపు వెలుపలే ఉన్నాయి. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా మాత్రం నాలుగేసి మ్యాచ్‌ల్లో విజయం సాధించి సెమీస్‌కు సులభంగా అడుగుపెట్టేశాయి. టీమ్ఇండియా మహిళా క్రికెట్ జట్టు వరుస మ్యాచ్‌ల్లో ఓటమి గ్యాప్‌లో ఉంది. కానీ, ఆ తప్పుల నుంచి సరైన పాఠం నేర్చుకోవడం లేదు. చివరివరకు పోరాటంలో తడబడుతూ, చేతిలో ఉన్న విజయాలను ప్రత్యర్థులకు ఇచ్చేస్తోంది. గత మూడు మ్యాచ్‌ల్లో కూడా ఇదే దృశ్యం. వన్డే ప్రపంచకప్ కీలక దశ చేరుకోవడం దగ్గరగా ఉన్న సమయంలో, హర్మన్‌ప్రీత్ సేన తక్షణమే వ్యూహాలను మార్చాలి. చివరి వార్షికం వరకు గట్టిగా పోరాటం చేస్తేనే జట్టు విజయాల మార్గంలో అడుగులు వేస్తుంది.

# రోహిత్, కోహ్లీలతో నా రిలేషన్ మారలేదు

## వన్డే కెప్టెన్‌గా ఎంపికైన శుభ్‌మన్ గిల్




రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలతో తనకున్న రిలేషన్ గురించి వన్డే కెప్టెన్‌గా ఎంపికైన శుభ్‌మన్ గిల్ స్పందించాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలతో తన రిలేషన్ గతంలోలాగే ఉందని, తనకు ఏ అవసరం వచ్చినా ఇద్దరు దిగ్గజ ఆటగాళ్లను సంప్రదించడానికి వెనుకాడనని గిల్ తెలిపాడు. సోషల్ మీడియాలో ఇటీవల వస్తున్న కథనాలపై ఈ విధంగా స్పందించాడు. భారత వన్డే జట్టుకు కెప్టెన్‌గా ఎంతో విజయవంతమైన రోహిత్ శర్మ స్థానాన్ని గిల్ భర్తీ చేశాడు. అప్పటి నుంచి ఇద్దరు దిగ్గజ ఆటగాళ్లు రోహిత్, కోహ్లీల భవిష్యత్తుపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఆదివారం పెర్త్ వేదికగా ప్రారంభం కానున్న ఆస్ట్రేలియాతో మూడు మ్యాచ్‌ల సిరీస్ భారత వన్డే కెప్టెన్‌గా గిల్ తొలి సిరీస్.స్వాన్ నది ఒడ్డున మ్యాచ్‌కు ముందు మీడియా సమావేశానికి హాజరు కావడం చాలా అసాధారణం. "బయట ఒక విషయం నడుస్తోంది, కానీ రోహిత్‌తో నాకున్న రిలేషన్‌లో ఏమీ మారలేదు. నేను ఏదైనా అడగాలనుకుంటే, సలహా కోరాలని భావిస్తే కచ్చితంగా రోహిత్ ను సంప్రదిస్తాను. పిచ్ స్వభావం గురించి సలహా కావాలన్నా, మ్యాచ్ గురించి అయినా రోహిత్ సహాయం చేస్తాడు" అని సిరీస్ ప్రారంభానికి ముందు గిల్ అన్నాడు. "నాకు విరాట్ భాయ్, రోహిత్ భాయ్‌లతో మంచి అనుబంధం ఉంది. నేను వెళ్లి ఈ పరిస్థితుల్లో కెప్టెన్ అయితే మీరేం చేస్తారు, ఎలాంటి నిర్ణయం తీసుకుంటారని నిర్మోహమాటంగా అడుగుతాను. సలహాలు ఇవ్వడానికి వారిద్దరూ ఎప్పుడూ వెనుకాడరు. 25 ఏళ్ల కెప్టెన్‌ను. నామీద పెద్ద బాధ్యత ఉంది. ఇద్దరు మాజీ కెప్టెన్ల నుండి చాలా మద్దతు అవసరం. టీమ్‌ను ఎలా ముందుకు తీసుకెళ్లాలి, ఏ రకంగా నిర్ణయాలు తీసుకుని జట్టును ముందుకు తీసుకెళ్లాలనే దానిపై విరాట్ భాయ్, రోహిత్ భాయ్‌లతో నేను చాలాసార్లు మాట్లాడాను. వారి అనుభవాలు మాకు సహాయపడతాయి' అని గిల్ పేర్కొన్నాడు. "మహీ భాయ్ (ఎంఎస్ ధోని), విరాట్, రోహిత్ అందించిన వారసత్వం, ఎన్నో అనుభవాల నుంచి నేర్చుకున్న విషయాలు చాలా ఉన్నాయి. వారి అనుభవం, నైపుణ్యం చాలా గొప్పది. వారి ఆట చూస్తూ పెరిగాను. వారిని నేను ఆరాధించేవాడిని, అది నన్ను ప్రేరేపిస్తుంది. అలాంటి దిగ్గజాలు నా సారథ్యంలో ఆడటం గొప్ప గౌరవంగా భావిస్తాను. జట్టుకు ఏ విధంగా మెస్సేజ్ ఇవ్వాలి. ఆటగాళ్లలో ఎలా కమ్యూనికేషన్ జరపాలి అనే విషయంపై రోహిత్, కోహ్లీలను అడిగి తెలుసుకున్నాను. వారితో కలిసి ఆడినప్పుడు కొన్ని విషయాలు నేర్చుకున్నాను. ఆస్ట్రేలియాతో సిరీస్ లో వారు ప్రత్యేకంగా నిలుస్తారు. రోహిత్, కోహ్లీలు దాదాపు 20 సంవత్సరాలుగా భారత క్రికెట్‌కు సేవలందించారు. వారి అనుభవాన్ని రిపీట్ చేయలేం. కానీ వ్యక్తిగతంగా, తనపై ఎంత ఎక్కువ బాధ్యత ఉంటే, అంత బాగా ఆడతానని నమ్ముతాను. కెప్టెన్సీ అనే అదనపు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తాను.నేను ఒత్తిడిలో రాణిస్తాను, నా అత్యుత్తమ ఆట బయటకు వస్తుంది. బ్యాటింగ్ చేసినప్పుడు బ్యాటర్‌గా ఆలోచిస్తాను, ఆపై బెస్ట్ నిర్ణయం నిర్ణయాలు తీసుకుంటాను. ఒక బ్యాటర్‌గా, నేను కెప్టెన్‌లా ఆలోచించడానికి మాత్రం ప్రయత్నించను. అలా చేస్తే ఒత్తిడి పెరుగుతుంది. దాంతో స్వేచ్ఛగా ఆడలేం. మన అత్యుత్తమ ఆట ప్రదర్శించలేమని" ఆసీస్ తో వన్డే సిరీస్‌కు ముందు మీడియాతో మాట్లాడుతూ భారత వన్డే కెప్టెన్ గిల్ కీలక విషయాలు వెల్లడించాడు.




# ఘనంగా దీపావళి జరుపుకున్న భారత క్రికెటర్లు

దేశవ్యాప్తంగా దీపావళి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు. భారత క్రికెటర్లు సైతం ఈ దీపావళిని ప్రత్యేకంగా జరుపుకున్నారు. దీపావళి సందర్భంగా క్రికెట్ దిగ్గజాలు తమ అభిమానులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఐసీసీ ఛైర్మన్ జై షా సహా పలువురు ప్రముఖ క్రికెటర్లు ఉన్నారు. అదే సమయంలో ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న విరాట్ కోహ్లీ దీపావళి సందర్భంగా ప్రత్యేక మెస్సేజ్ ఇచ్చారు. భారత వన్డే జట్టు వైస్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్, "అందరికీ దీపావళి శుభాకాంక్షలు! అని ఎక్స్ లో పోస్ట్ చేశాడు. మీ జీవితం వెలుగులు, ప్రేమ, అమిత ఆనందంతో నిండి ఉండాలి" అని రాసుకొచ్చాడు..భారత జట్టు టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ "వెలుగు, ఆనందం ఉంటే చాలా సానుకూలత. మీ అందరికీ దీపావళి శుభాకాంక్షలు!" అని శుభాకాంక్షలు తెలిపాడు. భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఇంటిలోనూ వెలుగు ప్రకాశింపజేయాలి, ప్రతి హృదయంలో శాంతి, ఆనందం నివసిస్తుంది అని పోస్ట్ చేశారు. భారత మాజీ క్రికెటర్ వివిఎస్ లక్ష్మణ్ ఇలా పోస్ట్ చేశారు. దీపావళి దివ్య కాంతి మీ జీవితాలను శాంతి, శ్రేయస్సు, ఆనందంతో ప్రకాశింపజేస్తుంది. మీ అందరికీ ప్రకాశవంతమైన, అందమైన దీపావళి శుభాకాంక్షలు అని లక్ష్మణ్ విషెస్ తెలిపారు.




# అడిలైడ్‌లో కోహ్లీ రానించేనా..?

పునరాగమనంలో డకౌట్‌తో తీవ్రంగా నిరాశపర్చిన విరాట్ కోహ్లీ.. మరో కీలక పోరుకు సిద్ధమయ్యాడు. అచ్చొచ్చిన మైదానంలో ప్రత్యర్థికి చుక్కలు చూపించేందుకు రెడీ అవుతున్నాడు. నాలుగున్నర నెలల సుదీర్ఘ విరామం తర్వాత ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి రీఎంట్రీ ఇచ్చిన కోహ్లీ.. పెర్త్ వేదికగా జరిగిన తొలి మ్యాచ్ డకౌటయ్యాడు. దాంతో ఈ మ్యాచ్‌లో టీమిండియా డక్ వర్త్ లూయిస్ పద్ధతిన 7 వికెట్ల తేడాతో చిత్తయ్యింది. అడిలైడ్ వేదికగా గురువారం రెండో వన్డే జరగనుంది. ఈ సిరీస్‌లో నిలవాలంటే టీమిండియా ఈ మ్యాచ్ గెలవాలి. లేదంటే మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ కోల్పోతుంది. అడిలైడ్ వన్డే గెలవాలంటే కోహ్లీతో పాటు రోహిత్ శర్మ రాణించాలి. అయితే అడిలైడ్‌లో కోహ్లీ రికార్డ్స్ బాగున్నాయి. అడిలైడ్ వేదికగా మూడు ఫార్మాట్లలో కలిపి 15 ఇన్నింగ్స్‌లు ఆడిన కోహ్లీ.. 65 సగటుతో 975 పరుగులు చేశాడు. ఇందులో 5 సెంచరీలతో పాటు 4 శతకాలు ఉన్నాయి.ఇక్కడ ఇప్పటి వరకు 4 వన్డేలు ఆడిన కోహ్లీ 61 సగటుతో 244 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు ఉన్నాయి. దాంతో కోహ్లీ నుంచి మరో సెంచరీ వస్తుందని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. అడిలైడ్ వేదికగా అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా కూడా కోహ్లీ కొనసాగుతున్నాడు. 975 పరుగులతో అతను టాప్ స్కోరర్‌గా నిలవగా.. సర్ డాన్ బ్రాడ్‌మన్ (970), స్టీవ్ స్మిత్(934), గ్రెగ్ చాపెల్(747), షేన్ వాట్సన్ (729), ఆడమ్ గిల్‌క్రిస్ట్ (687) తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు. ఈ జాబితాలో బ్రాడ్‌మన్ మినహా మిగతా బ్యాటర్లంతా కోహ్లీ కంటే ఎక్కువ ఇన్నింగ్స్ ఆడారు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ 2024-25లో భాగంగా అడిలైడ్ వేదికగా చివరిసారిగా ఆడిన కోహ్లీ.. ఈ డే/నైట్ టెస్ట్‌లో తీవ్రంగా నిరాశపర్చాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో 7, 11 పరుగులు మాత్రమే చేశాడు. వన్డే ప్రపంచకప్ 2027 ఆడటమే లక్ష్యంగా పెట్టుకున్న కోహ్లీ, రోహిత్‌లకు ఈ మ్యాచ్ అగ్ని పరీక్షగా మారింది. ఈ మ్యాచ్‌లో రాణిస్తేనే వారిపై ఒత్తిడి తగ్గనుంది. లేదంటే విమర్శలు రెట్టింపు అవుతాయి.

# బ్రాడ్ ఎవాన్స్ టెస్ట్ క్రికెట్‌లో కొత్త రికార్డు

జింబాబ్వే ఆల్ రౌండర్ బ్రాడ్ ఎవాన్స్ టెస్ట్ క్రికెట్‌లో కొత్త రికార్డు సృష్టించాడు. కేవలం 9.3 ఓవర్లలోనే 5 వికెట్లు పడగొట్టాడు. జింబాబ్వే టాస్ గెలిచి ఆఫ్ఘనిస్తాన్‌పై బౌలింగ్ ఎంచుకుంది. దీని ప్రకారం, మొదట బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్తాన్ జట్టు మంచి ఆరంభాన్ని ఇచ్చింది. కానీ 77 పరుగుల వద్ద 2వ వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత ఆఫ్ఘన్ బ్యాట్స్‌మెన్స్ పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఫలితంగా, ఆఫ్ఘనిస్తాన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 127 పరుగులకు ఆలౌట్ అయింది.ఆఫ్ఘనిస్తాన్ జట్టు తక్కువ స్కోరు సాధించడానికి ప్రధాన కారణం బ్రాడ్ ఎవాన్స్. ఈ మ్యాచ్‌లో ఇవాన్స్ 57 బంతులు వేసి కేవలం 22 పరుగులకు 5 వికెట్లు పడగొట్టాడు. దీంతో పాటు, జింబాబ్వే తరపున ఒక టెస్ట్ మ్యాచ్‌లో అత్యల్పంగా 5 వికెట్లు తీసిన రికార్డును కూడా అతను సృష్టించాడు. గతంలో ఈ రికార్డు జింబాబ్వే మాజీ కెప్టెన్ హీత్ స్ట్రీక్ పేరిట ఉండేది. 2001లో వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో స్ట్రీక్ 27 పరుగులకు 5 వికెట్లు పడగొట్టాడు. దీనితో, జింబాబ్వే తరపున ఒక టెస్ట్‌లో అతి తక్కువ పరుగులకు ఐదు వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. 24 సంవత్సరాల క్రితం నెలకొల్పిన రికార్డును బ్రాడ్ ఎవాన్స్ ఇప్పుడు బద్దలు కొట్టాడు. ఆఫ్ఘనిస్తాన్‌పై కేవలం 22 పరుగులకు 5 వికెట్లు పడగొట్టి అతను కొత్త చరిత్ర సృష్టించాడు. దీనితో, జింబాబ్వే తరపున అతి తక్కువ పరుగులు ఇచ్చి 5 వికెట్లు తీసిన బౌలర్‌గా బ్రాడ్ ఎవాన్స్ నిలిచాడు.



# పుకార్లకు ఫుల్‌స్టాప్..

## నిర్మాతపై 'ఓజీ' దర్శకుడి ప్రశంసల వర్షం





'ఓజీ' చిత్ర దర్శకుడు సుజీత్, నిర్మాత డీవీవీ దానయ్య మధ్య విభేదాలు తలెత్తాయంటూ గత కొంతకాలంగా ఇండస్ట్రీ వర్గాల్లో జరుగుతున్న ప్రచారానికి సుజీత్ తన సోషల్ మీడియా పోస్టుతో ఫుల్‌స్టాప్ పెట్టే ప్రయత్నం చేశారు. తమ మధ్య ఎలాంటి పొరపొచ్చాలు లేవని చెబుతూ, నిర్మాత దానయ్యకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది."ఓజీ సినిమా గురించి బయట చాలామంది రకరకాలుగా మాట్లాడుకుంటారు. కానీ ఒక ప్రాజెక్ట్‌ను ప్రారంభం నుంచి ముగింపు వరకు నడిపించడానికి ఏం అవసరమో కొందరికి మాత్రమే అర్థమవుతుంది. ఆ విషయంలో నన్ను నమ్మి, నాకు అండగా నిలిచిన నా నిర్మాత దానయ్య గారికి, నా టీమ్‌కు మాటల్లో చెప్పలేనంతగా రుణపడి ఉంటాను" అని సుజీత్ తన పోస్టులో పేర్కొన్నారు.అయితే, సుజీత్ ఉన్నట్టుండి ఈ పోస్ట్ పెట్టడం వెనుక బలమైన కారణం ఉందనే చర్చ జరుగుతోంది. వాస్తవానికి, సుజీత్ తన తదుపరి చిత్రాన్ని హీరో నానితో డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపైనే చేయనున్నట్లు గతంలో ప్రకటించారు. కానీ, కొద్ది రోజుల క్రితం ఈ ప్రాజెక్ట్ నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై లాంఛనంగా ప్రారంభమైంది. ఈ అనూహ్య మార్పుతోనే సుజీత్‌కు, దానయ్యకు మధ్య దూరం పెరిగిందని, అందుకే నిర్మాణ సంస్థ మారిందనే పుకార్లు షికారు చేశాయి.ఈ రూమర్లకు బలం చేకూర్చేలా 'ఓజీ' నిర్మాణ సమయంలోనూ ఇద్దరి మధ్య అభిప్రాయభేదాలు వచ్చాయని వార్తలు వినిపించాయి. ఈ ఊహాగానాల నేపథ్యంలోనే, తన నిర్మాతతో ఎలాంటి సమస్యలు లేవని స్పష్టం చేసేందుకే సుజీత్ ఈ పోస్ట్ పెట్టారని పలువురు అభిప్రాయపడుతున్నారు. కాగా, బాక్సాఫీసు వద్ద ఘన విజయం సాధించిన 'ఓజీ' సినిమా ఈ నెల 23 నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది.



# కళ్యాణ్ రామ్ సర్‌ప్రైజింగ్ లుక్ అదుర్స్

నందమూరి కళ్యాణ్ రామ్ ఈ ఏడాది 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెల్సిందే. విజయశాంతిని ఆ సినిమాలో నటింపజేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించాడు. కమర్షియల్‌గా కళ్యాణ్ రామ్ విజయాన్ని సొంతం చేసుకోలేక పోయినా నటుడిగా ప్రతి సినిమాకు మంచి పేరును సొంతం చేసుకుంటున్న విషయం తెల్సిందే. ప్రస్తుతం నందమూరి కళ్యాణ్ రామ్ మంచి కథల కోసం వెయిట్ చేస్తున్నాడు. ఇప్పటికే ఆయన వద్ద ఒకటి రెండు కథలు ఫైనల్ చేసి ఉన్నాయని, వాటిని త్వరలోనే పట్టాలెక్కించేందుకు రెడీ అవుతున్నాడని సమాచారం అందుతోంది. ఆకట్టుకునే విధంగా నందమూరి కళ్యాణ్ రామ్ ఈసారి సినిమాతో రావాలని ఆశ పడుతున్నాడు. అందుకే కాస్త ఆలస్యం అయినా పర్వాలేదు అని ఈ నందమూరి హీరో వెయిట్ అండ్ సీ అన్నట్లుగా తన సినిమాను లేట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. నందమూరి కళ్యాణ్ రామ్ లుక్... ఈ గ్యాప్‌లో నందమూరి కళ్యాణ్ రామ్ కథలు వినడంతో పాటు ఫిజిక్ విషయంలో దృష్టి పెట్టినట్లుగా ఉన్నాడు. అందుకే తాజాగా ఆయన లుక్ ను చూసి చాలా మంది సర్‌ప్రైజ్ అవుతున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా గ్రీక్ గాడ్ లుక్‌లో కళ్యాణ్ రామ్ కండలు తిరిగిన బాడీతో వావ్ అనిపిస్తున్నాడు. వయసు పెరుగుతున్నా కొద్ది కళ్యాణ్ రామ్ మరింత హ్యాండ్సమ్‌గా కనిపిస్తున్నాడు అంటే లేడీ ఫ్యాన్స్ సైతం కామెంట్స్ చేస్తున్నారంటే ఏ స్థాయిలో ఆయన లుక్ ఉందో అర్థం చేసుకోవచ్చు. కళ్యాణ్ రామ్ తాజా మేకోవర్, ఫిజిక్ ను చూస్తూ ఉంటే వచ్చే సినిమాలో ఖచ్చితంగా మంచి సాలిడ్ కంటెంట్‌తో, సాలిడ్ లుక్‌తో కనిపించే అవకాశాలు ఉన్నాయని అభిమానులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి ఈ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# మళ్లీ అవకాశాలు అంగీకరిస్తున్నా

## -రేణూదేశాయ్ వెల్లడి

ఒకప్పుడు కథానాయికగా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన రేణూ దేశాయ్ దాదాపు 20 ఏళ్ల తర్వాత రవితేజ 'టైగర్ నాగేశ్వరరావు'లో కనిపించిన సంగతి తెలిసిందే. సంఘ సంస్కర్త హేమలతా లవణం పాత్రని పోషించారు. అయితే, ఆ సినిమా సమయంలో తనపై కొన్ని విమర్శలు వచ్చాయని తాజాగా ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఆ ట్రోల్ చేసినవారు ఎవరూ తర్వాత తనకు క్షమాపణలు చెప్పలేదన్నారు. 'నేను 'టైగర్ నాగేశ్వరరావు' చేసిన సమయంలో నాపై విమర్శలు వచ్చాయి. కమ్‌బ్యాక్ ఇచ్చింది.. ఇక ఎక్కడ చూసినా కనిపిస్తుంది. ఎలాంటి సినిమాల్లోనైనా నటిస్తుందని రాశారు. ఇప్పుడు ఆ సినిమా వచ్చి రెండేళ్లు అవుతోంది. ఇప్పటివరకూ నేను మళ్లీ స్క్రీన్‌పై కనిపించలేదు. ఏ సినిమాకు సైన్ చేయలేదు. నేను సినిమాలు అంగీకరించలేదని నా గురించి అలా మాట్లాడిన వాళ్లు ఇప్పుడు వచ్చి క్షమాపణలు చెప్పరు. మాట్లాడేవారు ఎలాగైనా మాట్లాడతారంతే. నాకు నటన అంటే చాలా ఇష్టం. కానీ, అదే నా లక్ష్యం కాదు. 15 ఏళ్ల వయసులోనే ఇండస్ట్రీకి వచ్చాను. నేను డబ్బుకు ప్రాధాన్యం ఇచ్చే మనిషిలా కనిపిస్తాను. డబ్బును జాగ్రత్తగా ఖర్చు చేస్తాను.. కానీ, దానికి ప్రాధాన్యం ఇవ్వను. ఒకవేళ నేను అప్పటినుంచి ఇప్పటి వరకూ సినిమాలు చేస్తూ ఉన్నట్లైతే ఇప్పటికి చాలా మంచి పేరు వచ్చేదని రేణు చెప్పారు. తనకు ఇప్పుడు గొప్ప పాత్రలు వస్తున్నాయన్నారు. మహిళా ప్రాధాన్యం ఉన్న చిత్రాల్లో ఛాన్స్‌లు వస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అత్తగారి పాత్రకు ఓకే చేసినట్లు చెప్పారు. త్వరలోనే ఆ సినిమా ప్రారంభం కానుందన్నారు. అత్తాకోడళ్లకు సంబంధించిన కామెడీ చిత్రంగా అది రానున్నట్లు వెల్లడించారు. తనకు ఆధ్యాత్మిక మార్గం అంటే ఇష్టమని.. భవిష్యత్తులో సన్యాసం తీసుకునే అవకాశం ఉందని రేణూ దేశాయ్ చెప్పారు.

# నవీన్ పోలిశెట్టి... అనగనగా ఒక రాజు




జాతిరత్నాలు తరువాత మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి సినిమాతో వచ్చాడు. ఇక ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఇక దాని తరువాత నవీన్ నటిస్తున్న చిత్రం అనగనగా ఒక రాజు. కొన్ని కారణాల వలన ఆగుతూ వచ్చింది. మారి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను సితార ఎంటర్ టైన్మెంట్స్ బ్యానర్ పై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నాడు. మొదట ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్ గా నటిస్తుంది అని చెప్పారు. ఆ తరువాత ఆమె ప్లేస్ ను మీనాక్షీ చౌదరి రీప్లేస్ చేసింది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, వీడియోలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇక నవీన్ తన సినిమాకు ఏ రేంజ్ లో ప్రమోషన్స్ చేస్తుందో అన్న విషయం అందరికీ తెల్సిందే. ముఖ్యంగా అనగనగా ఒక రాజు సినిమా ప్రమోషన్స్ భాద్యత మొత్తం నవీన్ తన భుజాల మీద వేసుకున్నాడు. ప్రతి పండగకు అందరూ తమ సినిమావైపు తిరిగి చూసేలా ప్రమోషన్స్ చేస్తాడు. మొన్న దసరాకు పల్లెటూరు వెళ్ళి అక్కడున్నవారితో సినిమా గురించి మాట్లాడి దసరా శుభాకాంక్షలు చెప్పించాడు. ఇప్పుడు దీపావళీకి కూడా మరో కొత్త కాన్సెప్ట్ తో వచ్చేశాడు. దీపావళీ టపాకాయలు అమ్ముతూ తన సినిమా గురించి చెప్పుకొచ్చాడు. అనగనగా ఒక రాజు ఫుల్ ఎంటర్ టైన్మెంట్. దీపావళీ నుంచి సంక్రాంతి వరకు ఇది పేలుతూనే ఉంటుందని చెప్పుకొచ్చాడు. అంతేకాకుండా అనగనగా ఒక రాజు నుంచి మొదటి సాంగ్ ను త్వరలోనే రిలీజ్ కానుందని మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్ గా మారింది. ఇక ఈ ప్రమోషన్స్ చూసి .. నిజంగా నవీన్ జాతిరత్నం అంటూ కామెంట్స్ చేస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 14 న ఈ సినిమా ప్రేక్షకుల ముందకు రానుంది. మరి ఈ సినిమాతో రాజుగారు ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

# బాలీవుడ్ సీనియర్ నటుడు అస్రానీ కన్నుమూత



బాలీవుడ్ సీనియర్ నటుడు, దర్శకుడు గోవర్ధన్ అస్రాని కన్నుమూశారు. ఆయన వయసు 84 సంవత్సరాలు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న అస్రానిని నాలుగు రోజుల క్రితం కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆయన నిన్న సాయంత్రం తుదిశ్వాస విడిచారు. అస్రాని మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు, సహచరులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా సంతాపం వ్యక్తం చేస్తున్నారు. 1941లో రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో జన్మించిన అస్రాని.. ప్రారంభంలో ఆల్ ఇండియా రేడియోలో వాయిస్ ఆర్టిస్ట్‌గా పనిచేశారు. అదే సమయంలో తన విద్యను పూర్తి చేశారు. నటనపై ఉన్న ఆసక్తితో 1962లో ముంబయికి వెళ్లారు. అక్కడ దర్శకులు కిశోర్ సాహు, హృషికేశ్ ముఖర్జీ సలహా మేరకు పుణెలోని ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరారు. 1966లో విడుదలైన "హమ్ కహా జా రహే హై" సినిమాతో వెండితెరపై తొలి అడుగుపెట్టిన ఆయన, 1967లో వచ్చిన "హరే కాంచ్ కీ చూడియా"తో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే, "షోలే" సినిమాలో ఆయన పోషించిన జైలర్ పాత్ర ఆయనకు విశేషమైన పేరు తెచ్చిపెట్టింది.సుదీర్ఘ సినీ ప్రస్థానంలో అస్రాని 350కిపైగా సినిమాల్లో నటించి ప్రేక్షకులను అలరించారు. "హీరో హిందూస్థానీ", "డ్రీమ్ గర్ల్ 2" వంటి చిత్రాల్లో కూడా ఆయన గుర్తుండిపోయే పాత్రలు పోషించారు. అంతేకాకుండా "చలా మురారీ హీరో బన్నే", "ఉడాన్" వంటి సినిమాలకు దర్శకత్వం వహించి తన ప్రతిభను చాటుకున్నారు.బాలీవుడ్‌లో చిరునవ్వుల నటుడిగా పేరుగాంచిన అస్రాని మరణం సినీ ప్రపంచానికి పూడ్చలేని లోటు అని అభిమానులు చెబుతున్నారు.

# అమ్మాయిల తరపున వకాల్తా పుచ్చుకున్న రష్మిక..!

నేషనల్ క్రష్ రష్మిక మందన్న 'థామా' సినిమాతో నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆయుష్మాన్ ఖురాన హీరోగా నటించిన ఈ హర్రర్ థ్రిల్లర్ మూవీపై అంచనాలు పెరిగే విధంగా రష్మిక మందన్న గత రెండు వారాలుగా ప్రచారం చేసిన విషయం తెల్సిందే. ఇదే సమయంలో రష్మిక తన రాబోయే సినిమాల గురించి పలు ఆసక్తికర విషయాలను వెల్లడించింది. కానీ థామా సినిమా ప్రమోషన్ సమయంలో అయినా రష్మిక తన వివాహ నిశ్చితార్థం గురించి ఓపెన్ అవుతుందని అంతా భావించారు. కానీ రష్మిక ఆ ప్రశ్నలు రాకుండానే చాలా జాగ్రత్త పడింది. మీడియా సమావేశంలో ఆ విషయాల గురించి ప్రస్తావించిన సమయంలో మౌనంగా నవ్వుతూ ఉండి పోయింది. దాంతో రష్మిక మందన్న, విజయ్ దేవరకొండల యొక్క వివాహ నిశ్చితార్థం గురించి ఇంకా క్లారిటీ రాలేదు అని అభిమానులతో పాటు అంతా ఆవేదన వ్యక్తం చేస్తూనే ఉన్న విషయం తెల్సిందే. రష్మిక మందన్న థామా సినిమా రిలీజ్ తాజాగా రష్మిక మందన్న ఒక చిట్ చాట్‌లో ప్రేమ విఫలం, ఆ సమయంలో ఇద్దరూ పడే బాధ గురించి మాట్లాడింది. చాలా మంది లవ్ బ్రేకప్ సమయంలో ఎక్కువగా అబ్బాయిలు బాధ పడుతారు, వారే చాలా కాలం పాటు అందులో నుంచి బయటకు రాలేక పోతారు, ఆత్మహత్యలు చేసుకుంటారు, దారుణాలకు వడిగడుతారు అంటూ ప్రచారం ఉంది. పలు సర్వేల్లోనూ అదే విషయం వెల్లడి అయింది. కానీ రష్మిక మాత్రం అందుకు విరుద్ధంగా చెప్పుకొచ్చింది. ప్రేమ విఫలం అయిన సమయంలో అబ్బాయిలు మాత్రమే బాధ పడుతారు అంటూ ఉన్న ప్రచారంను ఆమె కొట్టి పారేసింది. అబ్బాయిలు ఎక్కువగా బాధ పడుతారు అంటే తాను ఒప్పుకోను అంది. అబ్బాయిలకు ఏమాత్రం తగ్గకుండా, వారి రిలేషన్‌షిప్ విషయంలో అమ్మాయిలు కూడా చాలా సీరియస్‌గా ఉంటారని రష్మిక మందన్న తాజా ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది.లవ్ ఫెయిల్యూర్‌పై రష్మిక మందన్న ఇంకా రష్మిక మందన్న మాట్లాడుతూ... అమ్మాయిలు బాధను వ్యక్తపరిచేందుకు మార్గాలు లేవు అన్నట్లుగా చెప్పుకొచ్చింది. అబ్బాయిలు ప్రేమ విఫలం అయిందంటే గడ్డాలు పెంచుకోవడం, మందు తాగడం చేస్తారు. కానీ అమ్మాయిలు అలా చేయలేరు. పెంచుకోవడానికి గడ్డం ఉండదు, అలాగే మందు తాగి తమ ప్రేమ విఫలం గురించి బయట పడరు అంది. అమ్మాయిలకు తమ ఆవేదన వ్యక్తం చేసుకునేందుకు ఎక్కువ మార్గాలు లేకపోవడం వల్లే అబ్బాయిలకు ఈ విషయంలో ఎక్కువగా సానుభూతి లభిస్తుంది అంటూ రష్మిక మందన్న ఈ విషయంలో అమ్మాయిల తరపున వకాల్తా పుచ్చుకుని మాట్లాడింది.

